www.udyamakeratam.com

PRGI No. : TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 110 | | 8-10-2026 | | గురువారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/-

# ఢిల్లీలో మళ్లీ ఓటు మంటలు!



- జంతర్ మంతర్‌కు వెళ్తున్న ఇండియా కూటమి ఎంపీలను అడ్డుకున్న పోలీసులు
- రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలు అదుపులోకి
- నేలపై పడుకుని ప్రియాంక నిరసన.. బస్సులపైకి ఎక్కి ఎంపీల నినాదాలు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ విపక్షాల పట్టు
- 'నాపై 45 ఎఫ్ఐఆర్‌లు.. ఒక్కో కేసు ఒక్కో మెడల్' అంటూ రాహుల్ వ్యాఖ్యలు



దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం తీరుకు వ్యతిరేకంగా 'ఇండియా' కూటమి చేపట్టిన నిరసన ప్రదర్శన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష నేతలు బుధవారం జంతర్ మంతర్ వైపు చేపట్టిన ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్నారు. జంతర్ మంతర్‌కు కొద్ది దూరంలోనే ఎంపీలు ప్రయాణిస్తున్న బస్సులను పోలీసులు నిలిపివేయడంతో తీవ్ర రసాభాస నెలకొంది. ఈ క్రమంలో బస్సుల నుంచి బయటకు వచ్చిన నేతలు రహదారిపైనే బైఠాయించి నిరసన తెలపగా, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు మహిళా నేతలు రోడ్డుపై పడుకుని రాజ్యాంగ ప్రతిని చేత పట్టుకుని ఆందోళన నిర్వహించారు. ఉద్రిక్త పరిస్థితుల నడుమ పోలీసులు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, పలువురు సీనియర్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

వివరాలు 4లో..



# కొమురం భీం పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

### టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

- హక్కుల సాధనకు రాజీలేని పోరాటమే మార్గం
- క్యాష్‌లెస్ వైద్యం లేక అప్పుల పాలవుతున్న జర్నలిస్టులు
- ఇళ్లు, ఇంటి స్థలాల హామీ అమలుకాక తీవ్ర నిరాశ
- ఎన్నికల హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్
- కథనాల్లో వాస్తవాలుంటేనే విశ్వసనీయత: కలెక్టర్ హరిత

వివరాలు 5వ పేజీలో

జల్... జంగల్... జమీన్ నినాదంతో ఆదివాసీల ఆత్మగౌరవం కోసం పోరాడిన అమరవీరుడు కొమురం భీం పోరాట స్ఫూర్తితో జర్నలిస్టులు తమ హక్కుల సాధనకై ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఖఖౌజీ - Xజీఖ) రాష్ట్ర అధ్యక్షుడు కే. విరాహత్ అలీ పిలుపునిచ్చారు. బుధవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని 'ఏ రోజ్ గార్డెన్స్'లో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ అధ్యక్షతన నిర్వహించిన తృతీయ మహాసభకు ఆయన విశిష్ట అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆసిఫాబాద్ కేవలం అడవి మాత్రమే కాదని, ఆదివాసీల పోరాట వారసత్వానికి, ఆత్మగౌరవానికి చిరునామా అని కొనియాడారు. 75 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన టీయూడబ్ల్యూజే ఏ రాజకీయ పార్టీకీ అనుబంధంగా కాకుండా, కేవలం జర్నలిస్టుల సంక్షేమం కోసమే నిరంతరం రాజీలేని పోరాటాలు చేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

- ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్

## జర్నలిస్టుల నమ్మకమే నా ఊపిరి

### టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్

- జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధన కోసం పోరాడుతా

5

టీయూడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడిగా 3వ సారి ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు



# 'సర్'లో పేరు మిస్సయిందా?

- మళ్లీ ఓటరయ్యే ఛాన్స్!
- ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం ప్రత్యేక డ్రైవ్
- 'సర్' పూర్తయిన 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలు
- పాత-కొత్త జాబితాలను పోల్చి గల్లంతైన అర్హుల గుర్తింపు

4




# ఉద్యోగులకు 'డబుల్ డీఏ' ధమాకా!

- రెండు పెండింగ్ డీఏలు మంజూరు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు
- జనవరి 2024 నుంచి 37.31 శాతం.. జూలై నుంచి 40.04 శాతానికి పెంపు
- అక్టోబర్ జీతంతో పెరిగిన డీఏ.. నవంబర్ 1న చెల్లింపు
- యూజీసీ, ఏఐసీటీఈ సహా వివిధ పే స్కేళ్ల ఉద్యోగులకూ వర్తింపు
- బకాయిలను విడతలవారీగా చెల్లించనున్న ప్రభుత్వం

2




2

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న రెండు పెండింగ్ కరవు భత్యం విడతలను మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 2020 పే స్కేల్ ఉద్యోగులకు జనవరి 2024 నుంచి డీఏ 33.67 శాతం నుంచి 37.31 శాతానికి, జూలై 2024 నుంచి 40.04 శాతానికి పెరగనుంది. పెరిగిన డీఏను అక్టోబర్ జీతంతో కలిపి నవంబర్ 1న చెల్లించనున్నారు.



# రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ డిమాండ్

- చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరువ
- 19,892 మెగావాట్లకు చేరిన డిమాండ్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

2



## ఢిల్లీలో కూలిన ఐదంతస్తుల భవనం.. ముగ్గురు మృతి!

- సీమాపురిలో ఒక్కసారిగా కుప్పకూలిన నివాస భవనం
- మృతుల్లో చిన్నారి.. మరో ఎనిమిది మందికి గాయాలు
- శిథిలాల కింద మరికొందరు ఉన్నట్లు అనుమానం..

4

# అనుభవమే నా గొప్ప ఆస్తి

ప్రభుత్వ అధినేతగా పాతికేళ్ల ప్రస్థానంపై ప్రధాని మోదీ భావోద్వేగం

'ఈ 25 ఏళ్ల అనుభవం నాది కాదు.. దేశానికే చెందుతుంది'

'దేశం నాకు ఎంతో ఇచ్చింది.. అందుకే నా బాధ్యత మరింత ఎక్కువ'



4

## తరగతి గది లోపలే చిన్నారి

ఘటనపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం

2



## ట్రూ-అప్ చార్జీలపై కుంటిసాకులా?

- రూ.5,420 కోట్ల భారంపై ఎందుకు సమాధానం చెప్పలేదు?
- విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీశ్ ధ్వజం

3



## దసరా పండుగకు ప్రత్యేక బస్సులు

- రాష్ట్ర ఆర్టీసీ కీలక నిర్ణయం

2





# ఉద్యోగులకు 'డబుల్ డీఏ' ధమాకా!

**రెండు పెండింగ్ డీఏలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**

**అక్టోబర్ జీతంతో పెరిగిన డీఏ.. నవంబర్ 1న చెల్లింపు**

**బకాయిలను విడతలవారీగా చెల్లించనున్న ప్రభుత్వం**

**హైదరాబాద్, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న రెండు పెండింగ్ కరవు భత్యం విడతలను మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 2020 పే స్కేల్ ఉద్యోగులకు జనవరి 2024 నుంచి డీఏ 33.67 శాతం నుంచి 37.31 శాతానికి, జూలై 2024 నుంచి 40.04 శాతానికి పెరగనుంది. పెరిగిన డీఏను అక్టోబర్ జీతంతో కలిపి నవంబర్ 1న చెల్లించనున్నారు. రెండు విడతలతో కలిపి డీఏలో మొత్తం 6.37 శాతం పాయింట్ల పెరుగుదల లభించింది. జనవరి 2024 నుంచి తొలి విడతలో 3.64 శాతం పాయింట్లు, జూలై 2024 నుంచి మరో 2.73 శాతం పాయింట్లు పెరిగాయి. ఈ రెండు డీఏలతో రాష్ట్ర ఖజానాపై ఏటా సుమారు రూ.3,057 కోట్ల అదనపు భారం పడనున్నట్లు అంచనా. 2015 పే స్కేల్ ఉద్యోగులకు డీఏ 73.344 శాతం నుంచి 78.06 శాతానికి, ఆ తర్వాత జూలై 2024 నుంచి 81.728 శాతానికి పెంచారు. 2016 పే స్కేల్ ఉద్యోగులకు 46 శాతం నుంచి 50 శాతానికి, జూలై 2024 నుంచి 53 శాతానికి పెంచారు. 2006 పే స్కేల్ ఉద్యోగులకు 230 శాతం నుంచి 239 శాతానికి, అనంతరం 246 శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. యూజీసీ, ఏఐసీటీఈ పే స్కేళ్ల పరిధిలోని ఉద్యోగులకూ పెంపు వర్తించనుంది. జనవరి 2024 నుంచి సెప్టెంబర్ 2026 వరకు తొలి డీఏకు సంబంధించిన బకాయిలను 33 విడతల్లో, జూలై 2024 నుంచి సెప్టెంబర్ 2026 వరకు రెండో డీఏ బకాయిలను 27 విడతల్లో చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అర్హులైన ఉద్యోగుల బకాయిలను సాధారణ భవిష్యనిధి ఖాతాల్లో జమ చేయనున్నట్లు సమాచారం.

# తరగతి గది లోపలే చిన్నారి

**బెంబర్ పాఠశాలలో సిబ్బంది నిర్లక్ష్యం**

**ఘటనపై కలెక్టర్ భవేశ్ మిశ్రా తీవ్ర ఆగ్రహం**

**ప్రధానోపాధ్యాయురాలు డి.స్వప్న సస్పెన్షన్.. స్కావెంజర్‌పై వేటు**



**ఆదిలాబాద్, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** పాఠశాల సమయం ముగిసింది.. ఉపాధ్యాయులు, సిబ్బంది వెళ్లిపోయారు.. తరగతి గదులకు తాళాలు కూడా పడిపోయాయి. కానీ ఓ రెండో తరగతి చిన్నారి మాత్రం గదిలోనే ఉండిపోయింది! తానూర్ మండలం బెంబర్ ప్రాథమికోన్నత పాఠశాలలో చోటుచేసుకున్న ఈ ఘటన సిబ్బంది నిర్లక్ష్యాన్ని బయటపెట్టింది. విద్యార్థిని గదిలో ఉన్న విషయాన్ని గుర్తించకుండానే తాళం వేసి వెళ్లిపోవడంపై కలెక్టర్ భవేశ్ మిశ్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై స్పందించిన కలెక్టర్ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రధానోపాధ్యాయురాలు డి.స్వప్నను సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకున్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించిన స్కావెంజర్‌ను సైతం విధుల నుంచి తొలగించారు. పాఠశాల ముగిసే సమయంలో ప్రతి విద్యార్థి సురక్షితంగా బయటకు వెళ్లాడా లేదా అన్నది ఉపాధ్యాయులు, సిబ్బంది తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. తరగతి గదులను మూసే ముందు పూర్తిగా పరిశీలించాలని స్పష్టం చేశారు. చిన్నారుల భద్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా సహించేది లేదని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు సంబంధించిన చర్యలను మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని భవేశ్ మిశ్రా ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# 'ఎస్ఐఆర్ గో బ్యాక్'

- రాహుల్ అరెస్టుపై రేవంత్ ఫైర్!
- రాహుల్‌ను కలిసేందుకు బారాఖంబా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన తెలంగాణ సీఎం
- స్టేషన్ వద్ద అడ్డుకున్న పోలీసులు.. నేతలు, కార్యకర్తల నిరసన
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం ఆగదన్న రేవంత్
- 'సైమన్ గో బ్యాక్' తరహాలోనే 'ఎస్ఐఆర్ గో బ్యాక్' ఉద్యమమని వ్యాఖ్య
- ఈడీ, సీబీఐ తరహాలో ఈసీని రాజకీయ ప్రయోజనాలకు వాడుతున్నారంటూ ఆరోపణ



**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో విపక్షాల ఆందోళన మరింత ఉధృతమైంది. నిరసన సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని పోలీసులు అదుపులోకి తీసుకుని బారాఖంబా రోడ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించగా.. ఆయనను కలిసేందుకు వెళ్లిన తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని పోలీసులు తొలుత అడ్డుకున్నారు. దీంతో పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాహుల్ గాంధీ సహా పలువురు విపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయాన్ని జాతీయ వార్తా సంస్థలు కూడా ధ్రువీకరించాయి. రాహుల్ గాంధీని కలిసేందుకు రేవంత్ రెడ్డి బారాఖంబా రోడ్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా పోలీసులు ఆయనను అడ్డుకున్నట్లు వార్తలు వెల్లడించాయి. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఓబ్రెయిన్‌తోపాటు పలువురు విపక్ష నేతలు కూడా అక్కడికి చేరుకున్నారు. రాహుల్ గాంధీని అదుపులోకి తీసుకోవడాన్ని రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. వందేళ్ల క్రితం వలస పాలనకు వ్యతిరేకంగా 'సైమన్ గో బ్యాక్' నినాదం ప్రతిఘటనకు ప్రతీకగా నిలిచిందని, ఇప్పుడు ఓటు హక్కును కాపాడుకునేందుకు 'ఎస్ఐఆర్ గో బ్యాక్' నినాదం ఉద్యమ రూపం దాల్చిందని పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వెనక్కి తీసుకోవడంతోపాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. "దేశం నాకు ఎంతో ఇచ్చింది" అన్నట్టుగానే ప్రజాస్వామ్యం ఇచ్చిన ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని రేవంత్ పేర్కొన్నారు. రాహుల్ నాయకత్వంలో ప్రజల ఓటు హక్కుల పరిరక్షణ కోసం సాగుతున్న పోరాటం అరెస్టులతో ఆగదని స్పష్టం చేశారు. జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు వీధుల నుంచి పార్లమెంట్ వరకు ఆందోళనలు కొనసాగుతాయని ప్రకటించారు. ప్రతిపక్షాలను రాజకీయంగా ఇబ్బంది పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం గతంలో ఈడీ, సీబీఐ వంటి సంస్థలను ఉపయోగించుకుందని, ఇప్పుడు స్వతంత్ర వ్యవస్థ అయిన ఎన్నికల సంఘాన్ని కూడా రాజకీయ ప్రయోజనాలకు వినియోగిస్తోందని రేవంత్ ఆరోపించారు. ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్లను జాబితాల నుంచి తొలగిస్తున్నారన్నది కాంగ్రెస్ ఆరోపణ కాగా, ఈ విమర్శలను ఎన్నికల సంఘం, బీజేపీ ఖండిస్తున్నాయి. నిరసనల సందర్భంగా ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డికి పోలీసుల చర్యలో గాయాలైనట్లు కూడా వార్తలు వెలువడ్డాయి. అరెస్టులు, పోలీసు చర్యలతో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాన్ని అణచివేయలేరని రేవంత్ స్పష్టం చేశారు.

# రోడ్డెక్కనున్న నేతలు!

- 2027లో తెలంగాణ రాజకీయాలకు 'పాదయాత్ర' జోష్
- రాష్ట్రవ్యాప్త యాత్రకు కేటీఆర్ సిద్ధం.. ఇప్పటికే ప్రకటించిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు
- క్యాడర్ విస్తరణకు పాదయాత్రపై తెలంగాణ రక్షణ సేన అధినేత కవిత దృష్టి
- ప్రజాపాలన-ప్రగతి బాటతో ఇప్పటికే క్షేత్రంలోకి రేవంత్.. రాష్ట్రవ్యాప్త యాత్రపై చర్చ
- బీజేపీ కూడా ప్రజా సమస్యలతో జనంలోకి.. ఎన్నికలకు ముందే వేడెక్కనున్న రాజకీయం



**హైదరాబాద్, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** తెలంగాణ రాజకీయాలు వచ్చే ఏడాది నుంచి రోడ్డెక్కనున్నాయి. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ ప్రధాన రాజకీయ పక్షాలు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయి పోరాటాలకు సిద్ధమవుతున్నాయి. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ 2027లో రాష్ట్రవ్యాప్త పాదయాత్ర చేపడతానని ఇప్పటికే ప్రకటించగా.. తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత కూడా పాదయాత్రకు సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. అధికార కాంగ్రెస్ సైతం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విస్తృతంగా క్షేత్రస్థాయి కార్యక్రమాలు చేపడుతోంది. దీంతో 2027 తెలంగాణ రాజకీయాల్లో 'పాదయాత్రల నామ సంవత్సరం'గా మారుతుందా అన్న చర్చ మొదలైంది. కేటీఆర్ తన పాదయాత్రపై ఇప్పటికే స్పష్టత ఇచ్చారు. 2027లో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టి ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని ఏప్రిల్‌లోనే ప్రకటించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పార్టీకి, ప్రజలకు మధ్య కొంత దూరం పెరిగిందని అంగీకరించిన ఆయన.. ఆ అంతరాన్ని తగ్గించుకునే ప్రయత్నంలోనూ పాదయాత్ర కీలకంగా ఉంటుందని పేర్కొన్నారు. ఎష్ట్రవ చీవష ×అఎఖుఅ జుఇజూతీవం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, రైతులు, నిరుద్యోగులు, కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను యాత్రలో ప్రధానంగా ప్రస్తావించే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు తెలంగాణ రక్షణ సేనను స్థాపించిన కల్వకుంట్ల కవిత కూడా ప్రజల్లోకి వెళ్లేందుకు పాదయాత్రను ప్రధాన సాధనంగా ఎంచుకుంటున్నారు. త్వరలో పాదయాత్ర ఉంటుందని, 'భైరవ' బస్సులో రాష్ట్రవ్యాప్త పర్యటన కూడా చేపడతానని ఇటీవల ఆమె వెల్లడించారు. ఎవశ్రీఖఅస్త్రుఖుఖు =ఖఎంష్ట్రుఖుఖు ూవఅఖు కొత్త పార్టీకి గ్రామస్థాయి నుంచి క్యాడర్‌ను నిర్మించుకోవడం, రైతులు, మహిళలు, యువత, కార్మిక వర్గాల సమస్యలను ముందుకు తీసుకురావడం ఆమె ముందున్న ప్రధాన రాజకీయ సవాలుగా కనిపిస్తోంది. ప్రతిపక్షాలకే ప్రజాక్షేత్రాన్ని వదిలేయకుండా అధికార కాంగ్రెస్ కూడా జనంలోకి వెళ్లే వ్యూహాన్ని అమలు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే 'ప్రజాపాలన–ప్రగతి బాట'లో భాగంగా సిరిసిల్లలో మూడు కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేసి ప్రజలతో మమేకమయ్యారు. ఎవశ్రీఖఅ–స్త్రుఖు క్ష్ఠవ ూశీఖ్షుశ్రీ వచ్చే ఎన్నికల వరకు వరుసగా రాజకీయ సభలు, క్షేత్రస్థాయి కార్యక్రమాలతో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. అయితే 2027లో రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్త పాదయాత్ర చేపడతారనే అంశంపై ఇప్పటివరకు అధికారిక షెడ్యూల్ వెలువడలేదు. రాజకీయ వర్గాల్లో మాత్రం దీనిపై చర్చ కొనసాగుతోంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ సహా ముఖ్య నేతలు మరింత విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. బీజేపీ సైతం ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయి కార్యక్రమాలను మరింత విస్తరించే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావుతోపాటు ముఖ్య నేతలు నియోజకవర్గాల వారీగా ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలపై దృష్టి పెట్టినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే రాష్ట్రవ్యాప్త పాదయాత్రకు సంబంధించి స్పష్టమైన తేదీలు, మార్గపటం ఇంకా ఖరారైనట్లు అధికారిక సమాచారం లేదు. ఇక ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తనదైన శైలిలో ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ప్రధాన పార్టీలన్నీ జనంలోనే రాజకీయ పోరాటానికి సిద్ధమైతే వచ్చే ఏడాది తెలంగాణలో సభలు, యాత్రలు, నిరసనలతో రాజకీయ వేడి మరింత పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. ఎన్నికలకు ముందు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాన్ని పెంచుకోవడం, పార్టీ శ్రేణులను కదిలించడం, ప్రత్యర్థులపై రాజకీయ ఒత్తిడి పెంచడం వంటి లక్ష్యాలతో పాదయాత్రలు మరోసారి కీలక రాజకీయ అస్త్రంగా మారుతున్నాయి. ఒకవైపు ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం.. మరోవైపు సంక్షేమ, అభివృద్ధి ప్రచారం.. ఇంకోవైపు కొత్త రాజకీయ శక్తుల ఉనికి పోరాటం.. వెరసి 2027లో తెలంగాణ రాజకీయం అసెంబ్లీ కంటే ఎక్కువగా రోడ్లపైనే కనిపించే సూచనలు స్పష్టమవుతున్నాయి.

# రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ డిమాండ్

**చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరువ**

**19,892 మెగావాట్లకు చేరిన డిమాండ్**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి**

**హైదారాబాద్, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం) :** రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరినట్లు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. దాదాపు 20 వేల మెగావాట్లకు చేరువైన డిమాండ్ ఉన్నప్పటికీ.. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించామని చెప్పారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే గణనీయంగా పెరిగిందన్నారు. కర్ణాటకలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్లలోపే ఉండగా.. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 13 వేల మెగావాట్లుగా ఉందని తెలిపారు. ఈ రాష్ట్రాల కంటే తెలంగాణలో విద్యుత్ వినియోగ డిమాండ్ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదైనప్పటికీ.. వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో కీలకపాత్ర పోషించిన విద్యుత్ సంస్థల సిబ్బందిని భట్టి విక్రమార్క అభినందించారు. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్, ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ, విద్యుత్ పంపిణీ సంస్థలు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ స్థాయిలో డిమాండ్ ఉన్నప్పటికీ సరఫరాను కొనసాగించగలిగామని తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్ర విద్యుత్ రంగంపై కొందరు నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క విమర్శించారు. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్, ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ, విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్ర విద్యుత్ సంస్థలను పబ్లిక్‌గా లిస్ట్ చేయడం లేదా వాటిని ప్రభుత్వ రంగం నుంచి తప్పించే ప్రతిపాదన కూడా లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మరింత బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. నెహ్రూ అనుసరించిన ఆర్థిక విధానాలను ప్రస్తావించిన భట్టి.. మిశ్రమ ఆర్థిక వ్యవస్థతో పాటు బలమైన ప్రభుత్వ రంగ సంస్థలు కాంగ్రెస్ విధానంలో కీలక భాగమని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేస్తూనే రాష్ట్ర అభివృద్ధికి అనుగుణంగా విద్యుత్ రంగాన్ని మరింత పటిష్టం చేస్తామని తెలిపారు.

# దసరా పండుగకు 7 వేల బస్సులు

**రాష్ట్ర ఆర్టీసీ కీలక నిర్ణయం**

**హైదారాబాద్, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్‌ఆర్టీసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఈ పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది. ఇందులో భాగంగా కరీంనగర్ జోన్ నుంచి మొత్తం 3533 బస్సులు నడుపుతోంది. రీజియన్ల వారిగా ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1175, వరంగల్ 530, ఖమ్మం 678, హైదరాబాద్ జోన్ నుంచి 2155 బస్సులు నడుపుతుండగా రీజియన్ల వారిగా మహబూబ్ నగర్ 645, మెదక్ 255, నల్గొండ 815, రంగారెడ్డి 440. అలాగే గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1312 దసరా పండగ కు ప్రత్యేక సర్వీసు లను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ప్రధానంగా ఈ నెల 9,10,16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ప్లాన్ చేసింది. అలాగే, ఈ నెల 25, 26 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ (నల్ల చెరువు), ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్బీ, బోయిన్పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పండల్స్, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనుంది. ప్రధాన పండుగులు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా రూట్లలో నడిపిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే 1.5 వరకు టికెట్ ధరలను సవరించుకునే వెసులుబాటును సంస్థకు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ప్రతి ప్రధాన పండుగకు 1.5 వరకు టికెట్ ధరలను ఉమ్మడి కార్పొరేషన్గా ఉన్నప్పటి నుండి అమలు చేస్తుంది. టీజిఎస్‌ఆర్టీసీ ఏర్పడిన నాటి నుండి ప్రతి ప్రధాన పండుగకు దీన్ని అమలు చేస్తుంది. ఈ దసరా పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం 1.5 వరకు టికెట్ ధరలను టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం సవరించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే స్పెషల్ బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయి. ఈ నెల 9, 10,16,17 తేదీలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 25,26 తేదీల్లో మాత్రమే సవరించిన చార్జీలు అమల్లో ఉంటాయి. స్పెషల్ బస్సులు మినహా రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా దసరా కు నడిపే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ రెగ్యులర్ , స్పెషల్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుందని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి స్పష్టం చేశారు. టీజీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ ను వెబ్ సైట్ లో బుక్ చేసుకోవాలని యాజమాన్యం తెలిపింది. దసరా కు స్వంత ఊర్లకు వెళ్లే ప్రయాణీకులు ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 లలో సంప్రదించాలని యాజమాన్యం సూచించింది.

# ట్రూ-అప్ చార్జీలపై కుంటిసాకులా?

- రూ.5,420 కోట్ల భారంపై ఎందుకు సమాధానం చెప్పలేదు?
- కరెంట్ సక్రమంగా ఇస్తే రైతులు రోడ్లెక్కి ధర్నాలు ఎందుకు చేస్తారు?
- విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీశ్‌రావు ధ్వజం
- యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ఉత్పత్తి.. బొగ్గు నిల్వలపై ప్రశ్నల వర్షం
- ట్రూ-అప్ భారం వెనక్కి తీసుకోకపోతే ప్రజా పోరాటం తప్పదని హెచ్చరిక



**హైదరాబాద్, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** విద్యుత్ వినియోగదారులపై ట్రూ-అప్ చార్జీల పేరుతో రూ.5,420 కోట్ల భారం మోపడంపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా వెళ్లిపోవడమేనా ప్రజాపాలన అంటూ బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత టి.హరీశ్‌రావు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కపై ధ్వజమెత్తారు. పండుగ వేళ ప్రజలపై భారం ఉపసంహరించి శుభవార్త చెబుతారని భావిస్తే నిరాశే మిగిలిందన్నారు. ప్రజల నుంచి రూ.5,420 కోట్లు వసూలు చేస్తామని అధికారులతో చెప్పించడం కాంగ్రెస్ ప్రజావ్యతిరేక పాలనకు నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలే లేవని ప్రభుత్వం చెబుతుంటే.. రైతులు సబ్‌స్టేషన్ల ముందు, రోడ్లపైకి వచ్చి ధర్నాలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. "సక్రమంగా కరెంట్ సరఫరా చేస్తే రైతులు రోడ్డెక్కాల్సిన అవసరం ఏముంది? బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు ఇలా విద్యుత్ కోసం ఆందోళనలు చేశారా?" అని నిలదీశారు. ప్రజల సమస్యలను ప్రస్తావిస్తే సవాళ్లు విసురుతున్న భట్టి విక్రమార్క.. తాము లేవనెత్తిన ప్రశ్నలకు మాత్రం సమాధానం చెప్పలేకపోయారని హరీశ్‌రావు విమర్శించారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు సింగరేణి గనుల నుంచి ఏటా 14 మిలియన్ టన్నుల జీ-9 గ్రేడ్ బొగ్గు కేటాయిస్తూ కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ 2018 ఫిబ్రవరి 15న ఉత్తర్వులు ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. అలాంటప్పుడు బొగ్గు కేటాయింపే లేదని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ఎల్‌నినోను కారణంగా చూపుతూ యాదాద్రిలో 3 వేల మెగావాట్లు, భద్రాద్రిలో 540 మెగావాట్లు, కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రంలో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో మొత్తం 140 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉంటే 89 మిలియన్ యూనిట్లే ఉత్పత్తి చేస్తున్నట్లు ప్రభుత్వమే చెప్పిందన్నారు. ఇది పరిపాలనా వైఫల్యం కాదా అని ప్రశ్నించారు. బొగ్గు ఉన్న ప్రాంతంలోనే విద్యుత్ ప్లాంట్లు ఉండాలని చెబుతున్న కాంగ్రెస్ నేతలు.. గతంలో రాయలసీమలో థర్మల్ ప్లాంట్ ఏర్పాటు చేసినప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. తెలంగాణ విద్యుత్ అవసరాలను పక్కనపెట్టి సింగరేణి నిర్మిస్తున్న 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. పెట్టుబడి అవసరం లేకుండానే 1,600 మెగావాట్ల విద్యుత్‌ను సరఫరా చేస్తామని ఎన్టీపీసీ ముందుకొచ్చినా ప్రభుత్వం తిరస్కరించిందని, ప్రస్తుత విద్యుత్ సమస్యలకు అది కూడా కారణమని ఆరోపించారు. 40 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు లేకున్నా ఉన్నట్లు చూపించి ఆదాయపు పన్ను, బొగ్గు సెస్, జిల్లా ఖనిజ నిధి చెల్లింపులు చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. నిజంగానే అంత బొగ్గు నిల్వ ఉంటే ప్రస్తుతం విద్యుత్ కష్టాలు ఎందుకు వచ్చాయని ప్రశ్నించారు. నదుల్లో నీరున్నా మోటార్లు నడిపి సాగునీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టలేదని, మరోవైపు అవసరమైన బొగ్గు నిల్వలు సిద్ధం చేసుకోకుండా థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని ప్రభావితం చేశారని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే సాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తాయని ఆరోపించారు. సింగరేణితోపాటు విద్యుత్ సంస్థలను ఐపీవో, కొత్త అప్పుల దిశగా తీసుకెళ్లేందుకు ఇంధన సంస్కరణల కమిటీని ఏర్పాటు చేసి, దానికి ప్రొఫెసర్ అరవింద్ సుబ్రమణ్యంను చైర్మన్‌గా నియమించే ప్రతిపాదన ఉందా లేదా చెప్పాలని డిమాండ్ చేశారు. యాదాద్రి విద్యుత్ కేంద్రంలోని బొగ్గు, బూడిద నిర్వహణ విభాగాలను ప్రైవేటు సంస్థకు అప్పగించడంపైనా ప్రశ్నించారు. దీనిని వ్యతిరేకిస్తూ విద్యుత్ ఉద్యోగులు ఆందోళనలకు దిగిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రెస్‌మీట్లు పెట్టి ప్రతిపక్షంపై ఆరోపణలు చేసినంత మాత్రాన ప్రజల విద్యుత్ కష్టాలు తీరవని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా విద్యుత్ కోతలు లేకుండా చర్యలు చేపట్టి, ట్రూ-అప్ చార్జీల పేరుతో ప్రజలపై మోపుతున్న రూ.5,420 కోట్ల భారాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన బీఆర్ఎస్ ఉద్యమిస్తుందని హెచ్చరించారు.

# గత పాలకుల కారణంగానే తీవ్ర ఆర్థిక భారం

- 'యాదాద్రి' ప్లాంటు కు బొగ్గు కేటాయింపును పట్టించుకోని గత ప్రభుత్వం
- ఈ పవర్ ప్లాంట్ నిర్మాణంతో ఆర్థిక భారం
- యూనిటు రూ.6.66 పడుతున్న విద్యుత్ ధర
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, అక్టోబర్ 7: యాదాద్రి పవర్ ప్లాంట్‌కు బొగ్గు కేటాయింపులో గత పాలకులు తప్పిదాలు చేశారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నైనీ కోల్ బ్లాక్‌ను పదేళ్లపాటు గత ప్రభుత్వం పట్టించుకోలేదు. వ్యక్తిగతంగా నైనీ కోల్ బ్లాక్‌పై సమాచారం సేకరించానన్నారు. సీఎం, మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజలతో మాట్లాడి నైనీలో మైనింగ్ ప్రారంభించాం. నైనీ కోల్ బ్లాక్‌ది ఫిక్స్‌డ్ కేటగిరీ.. పవర్ ప్లాంట్లకు మాత్రమే బొగ్గు కేటాయింపు అని స్పష్టం చేశారు. నైనీ నుంచి వస్తున్న బొగ్గును యాదాద్రికి మళ్లించడం శాశ్వత పరిష్కారం కాదన్నారు. ఇతర ప్లాంట్లకు బొగ్గు కేటాయింపు జరిగే వరకు మాత్రమే యాదాద్రికి బొగ్గు వచ్చే అవకాశం. యాదాద్రికి శాశ్వత బొగ్గు కేటాయింపు కోసం కేంద్రాన్ని కోరుతున్నాం. కోల్ ఇండియాకు లేఖ రాసి బొగ్గు కేటాయింపు కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా బొగ్గు కేటాయింపునకు చర్యలు చేపట్టామన్నారు. కేంద్ర బొగ్గు కేటాయింపు కమిటీకి కూడా లేఖ రాశాం. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సైతం బొగ్గు కేటాయింపుపై లేఖ రాశాం. గత ప్రభుత్వ తప్పిదాలను అధిగమిస్తూ యాదాద్రికి బొగ్గు కోసం ప్రయత్నిస్తున్నామని స్పష్టం చేశారు. యాదాద్రి పవర్ ప్లాంట్ వల్ల తక్కువ ధరకు విద్యుత్ లభిస్తుందా? యాదాద్రి విద్యుత్ ఉత్పత్తి ధర యూనిట్‌కు రూ.6.66. కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ విద్యుత్ ధర యూనిట్‌కు రూ.4.17, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ విద్యుత్ ధర యూనిట్‌కు రూ.4.60. యాదాద్రి విద్యుత్ ధరే ఎందుకు ఇంత అధికమని ఆయన ప్రశ్నించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ దేశంలోనే అత్యధిక వ్యయంతో విద్యుత్ అందించే గ్రిడ్‌గా మారింది. యాదాద్రి అధిక విద్యుత్ ధర భారం అంతిమంగా వినియోగదారులపైనే వినియోగదారులు అంటే తెలంగాణ ప్రజలపైనే పడుతుందన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్ కారణంగా రాష్ట్రంపై అదనపు ఆర్థిక భారం పడుతున్నదన్నారు. యాదాద్రి ప్లాంట్ జీవితకాలం సుమారు 25 ఏళ్లు, ఈ ప్లాంట్ పనిచేసినంత కాలం అధిక విద్యుత్ ధర భారం తప్పదు. బొగ్గు, నీటి వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లోనే పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి. బొగ్గును లారీలు, రైళ్లు, ఓడల ద్వారా తరలించడం ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ. విద్యుత్ గ్రిడ్ అందుబాటులో ఉన్నందున ఎక్కడ ఉత్పత్తి చేసినా వైర్ల ద్వారా విద్యుత్‌ను తరలించవచ్చు. సరైన ప్రణాళిక లేకుండా పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే డిస్కమ్‌లకు నష్టమన్నారు. గత పాలకుల తప్పుడు నిర్ణయాల భారం రాష్ట్ర ప్రజలు, విద్యుత్ డిస్కమ్‌లపై పడుతుందన్నారు.

### హరీశ్‌రావు వ్యాఖ్యలకు డిప్యూటీ సీఎం

పది సంవత్సరాలు అధికారంలో ఉండి ఏం చేశారో చెప్పకుండా.. ప్రతిపక్షంలో ఉన్నాం కదా అని ఏదిపడితే అది మాట్లాడటం సరికాదని హరీష్రావుకు, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హితవు చెప్పారు. ఆయన మాటలు వింటే నవ్వాలో.. ఏడవాలో అర్థం కావడం లేదు. సింగరేణి బొగ్గు బ్లాకుల విషయంలో గత ప్రభుత్వ వైఫల్యాలకు డాక్యుమెంటరీ ఆధారాలు ఉన్నాయి. 2014-2024 మధ్య అందుబాటులో ఉన్న 14 బొగ్గు బ్లాకులను మూసేశారు. కొత్త బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి పాల్గొనకుండా పక్కన పెట్టారు. వేలంలో పాల్గొని ఉంటే కనీసం కొన్ని బొగ్గు బ్లాకులైనా సింగరేణికి దక్కేవి. 14 బొగ్గు బ్లాకులు మూతపడటంతో 15 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి తగ్గిపోయింది. కొత్త బ్లాకులు తీసుకురాకపోయినా.. సింగరేణి తన పరిధిలో ఉత్పత్తిని పెంచింది. 2014-15లో 52.66 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2025-26లో 62.07 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసింది. డిస్పాచ్ బొగ్గు బ్లాకులు తగ్గినా.. సింగరేణి ఉత్పత్తిని 62.07 మిలియన్ టన్నులకు పెంచింది. సింగరేణి తన వంతుగా చేయాల్సిందం తా చేస్తూ నిలబడింది. విశాఖపట్నం, కృష్ణపట్నం నుంచి బొగ్గు రవాణాపై 07-12-2016న గత పాలకులు లేఖ రాశారు. లేఖ రాసిన తర్వాత రవాణా ఏర్పాట్లను పూర్తిగా వదిలేశారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌పై గత ప్రభుత్వ తప్పిదాలే రెండేళ్ల ఆలస్యానికి కారణం. 50 శాతం విదేశీ బొగ్గు.. 50 శాతం స్వదేశీ బొగ్గు వాడతామని చెప్పి పర్యావరణ అనుమతులు తీసుకున్నారు. ఆ తర్వాత 100 శాతం సింగరేణి బొగ్గు వాడతామని చెప్పి ఎన్జీటీకి వెళ్లారు. ఎన్జీటీ అనుమతులు రద్దు చేసిన తర్వాత ప్రాజెక్టుపై ఫాలోఅప్ చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 2024 ఫిబ్రవరి 20న మళ్లీ పబ్లిక్ హియరింగ్ నిర్వహించాం. ఎన్జీటీ సమస్యలను పరిష్కరించి యాదాద్రి పవర్ ప్లాంట్‌ను పునరుద్ధరించాం. రెండేళ్ల ఆలస్యమైన ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. అనుమతులు తీసుకువచ్చి యూనిట్లను వరుసగా కమిషన్ చేస్తున్నాం. సరిపడా బొగ్గు కేటాయింపులు లేకపోయినా ప్రత్యామ్నాయ మార్గాల్లో బొగ్గు సమీకరణ చేస్తున్నాం. యాదాద్రి పవర్ ప్లాంట్‌ను పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోంది. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ ముందుకు వెళ్తున్నాం. అభినందించాల్సింది పోయి హరీశ్‌రావు విమర్శలు చేయడం విడ్డూరం. మీ వల్ల జరిగిన పొరపాట్లకు ఇవన్నీ ఆధారసహిత పత్రాలున్నాయి. ఈ తప్పిదాలను వారానికి ఒకసారి ఆధారాలతో ప్రజాక్షేత్రంలో పెడతాం. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ఆధారాలతో ఎండగడతాం. పది సంవత్సరాల పాలనలో ఏం చేశారో హరీశ్‌రావు సమాధానం చెప్పాలి. ప్రతిపక్షంలో ఉన్నామనే కారణంతో బాధ్యతారహిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

# పత్రికల పెండింగ్ బకాయిలు చెల్లించాలి



- సమాచార శాఖ కమిషనర్‌కు టీఎంఎస్‌పీజేఏ విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన కమిషనర్

**హైదరాబాద్, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** ప్రభుత్వ శాఖల నుంచి పత్రికలకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించి పత్రికలను ఆదుకోవాలని తెలంగాణ మీడియం, స్మాల్ డైలీ అండ్ పీరియాడికల్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టీఎంఎస్‌పీజేఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు బుధవారం సచివాలయంలో సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ జి. ముకుందరెడ్డిని కలిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపూరావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పెండింగ్ బకాయిలకు సంబంధించిన బిల్లులను ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి పరిశీలనలో ఉన్నాయని, బకాయిలు త్వరలోనే చెల్లించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బాపూరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 400కు పైగా చిన్న, మధ్యతరహా దినపత్రికలు, వార, పక్ష, మాస పత్రికలు క్రమం తప్పకుండా ప్రచురితమవుతున్నాయని తెలిపారు. ఈ రంగంపై ఆధారపడి సుమారు ఐదువేల మంది పాత్రికేయులు పనిచేస్తున్నారని చెప్పారు. చిన్న పత్రికల మనుగడ, జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. చిన్న, మధ్యతరహా పత్రికల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రకటనల్లో చిన్న, మధ్యతరహా పత్రికలకు 30 శాతం వాటా కేటాయింపును అమలు చేయాలన్నారు. ప్రకటనల బిల్లుల సమర్పణకు ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేసి, బిల్లుల పరిష్కారంలో జాప్యాన్ని నివారించాలన్నారు. పత్రికల ప్రచురణ క్రమబద్ధత పరిశీలనకు ఆన్‌లైన్ విధానం అమలు చేయాలన్నారు. పత్రికల ఎంపానల్‌మెంట్ ప్రక్రియను ఆరు నెలలకు ఒకసారి నిర్వహించి, పక్ష పత్రికలకు కూడా అవకాశం కల్పించాలన్నారు. ముఖ్యమైన ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రముఖుల పర్యటనల వార్తా కవరేజీలో చిన్న, మధ్యతరహా పత్రికలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. పత్రికల్లో పనిచేస్తున్న పాత్రికేయులందరికీ ప్రమాద బీమా కల్పించాలని కోరారు. మారుతున్న మీడియా పరిస్థితులకు అనుగుణంగా పాత్రికేయులకు శిక్షణ, పునశ్చరణ కోర్సులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. మీడియా అకాడమీ పాలక మండలిలో టీఎంఎస్‌పీజేఏకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. చిన్న, మధ్యతరహా పత్రికలు, వాటిలో పనిచేస్తున్న పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని బాపూరావు కోరారు. సమస్యలపై అధికారులతో తక్షణ సమావేశం ఏర్పాటు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్ కంతేటి రమాదేవి, మిట్టపల్లి సురేందర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



# సామాజిక బహిష్కరణలపై బీసీ కమిషన్ కు ఫిర్యాదులు

### విజ్ఞాపనలు సమర్పించిన బాధితులు

**నిజామాబాద్, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** సామాజిక బహిష్కరణ ఉదంతాలపై తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ నేతృత్వంలో సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మి లతో కూడిన బృం దం బుధవారం నిజామాబాద్లోని కలెక్టరేట్లో బాధితులతో భేటీ అయ్యింది. ఐ.డీ.ఓ.సీకి చేరుకు న్న కమిషన్ ప్రతినిధులను కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ వి. భుజంగరావు తదితరులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాంఘిక, కుల బహిష్కరణలకు గురైన బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కమిషన్ చైర్మన్, సభ్యులకు లిఖితపూర్వకంగా విజ్ఞాప నలు సమర్పించారు. బాధితులు నిర్భీతితో, స్వేచ్ఛగా వారి అభిప్రాయాలను వెల్లడించేందుకు వీలు గా తగిన ఏర్పాట్లు చేశారు. దీంతో జిల్లాలోని ఆయా ప్రాంతాలలో గ్రామాభివృద్ధి కమిటీల పేరిట కొనసాగుతున్న అరాచకాల గురించి, సామాజిక బహిష్కరణ ఘటనలను బాధితులు కమిషన్ కు ఏకరువు పెట్టారు. బీసీ కుల సంఘాల నాయకులు, వివిధ వర్గాల వారు, ప్రజా సంఘాల ప్రతినిధు లు సైతం హాజరై రాతపూర్వకంగా విజ్ఞాపనలు కమిషన్ కు అందిస్తూ, మౌఖికంగా కూడా తమ అభిప్రాయాలను వెల్లడించారు. సాంఘిక బహిష్కరణలపై ఫిర్యాదులు సమర్పించేందుకు హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

# రూ.2,500.. రెండు తులాల బంగారం.. అంతా ఫేక్!

### మహిళలకు నెలవారీ సాయం, బంగారం అంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ ప్రచారం

### డీప్‌ఫేక్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

**హైదరాబాద్, అక్టోబర్ 8 (ఉద్యమ కెరటం):** మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం.. కల్యాణలక్ష్మి కింద రెండు తులాల బంగారం.. బతుకమ్మ నుంచే అమలు..! అంటూ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న ప్రచారం నిజం కాదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ ప్రకటన చేసినట్లుగా వైరల్ అవుతున్న వీడియోను మార్ఫింగ్ చేశారని, అసలు వీడియోకు కృత్రిమ మేధతో రూపొందించిన నకిలీ ఆడియోను జోడించారని ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం వెల్లడించింది. వైరల్ వీడియోలో కనిపిస్తున్న రేవంత్ రెడ్డి దృశ్యాలు కూడా తాజావి కావని తేలింది. అవి 2025 ఏప్రిల్‌లో హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన 892వ బసవ జయంతి వేడుకల్లో సీఎం మాట్లాడినప్పటివని ఫ్యాక్ట్‌చెక్ విభాగం పేర్కొంది. ఆ వీడియోలోని అసలు ఆడియోను మార్చి.. మహిళలకు రూ.2,500, రెండు తులాల బంగారం అందిస్తామని సీఎం ప్రకటించినట్లుగా కృత్రిమ మేధ ఆధారిత నకిలీ స్వరాన్ని జోడించినట్లు తెలిపింది. వైరల్‌గా మారిన ఆడియోను కృత్రిమ మేధ ఆధారిత గుర్తింపు సాధనాలతో పరిశీలించగా అది డీప్‌ఫేక్‌గా రూపొందించినట్లు సంకేతాలు లభించాయని ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం తెలిపింది. దీంతో ముఖ్యమంత్రి పేరుతో జరుగుతున్న ఈ ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు లేదా విస్తరణకు సంబంధించిన ప్రకటనల విషయంలో సామాజిక మాధ్యమాల్లో కనిపించే వీడియోలు, పోస్టులను గుడ్డిగా నమ్మవద్దని అధికారులు సూచించారు. ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కృత్రిమ మేధతో రూపొందిస్తున్న నకిలీ ఆడియోలు, మార్ఫింగ్ వీడియోల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

# ముషీరాబాద్‌లో ఓటర్ల తొలగింపు కలకలం

### బీజేపీ బూత్ ఏజెంట్‌పై ఎఫ్ఐఆర్ నమోదు!



**హైదరాబాద్, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** హైదరాబాద్ నగరంలోని ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా నుంచి 30 మంది ముస్లిం ఓటర్ల పేర్లను దొడ్డిదారిన తొలగించేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపై బీజేపీ బూత్ లెవల్ ఏజెంట్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. సూర్యనగర్ పోలింగ్ స్టేషన్ నెంబర్ 210 పరిధిలో ఎస్. బాలచందర్ అనే ఏజెంట్, ముస్లిం వర్గానికి చెందిన 30 మంది ఓటర్ల పేర్లను జాబితా నుండి తొలగించాలని కోరుతూ ముందస్తుగా ప్రింట్ చేసిన ఫారం-7 దరఖాస్తులను సెప్టెంబర్ 28న బూత్ లెవల్ అధికారికి (దీూా) సమర్పించేందుకు ప్రయత్నించారు. అయితే అధికారులు వాటిని మూకుమ్మడిగా స్వీకరించేందుకు నిరాకరించడంతో, ఆ పత్రాలను అక్కడే వదిలి ఆయన పరారయ్యారు. ఈ వ్యవహారంపై ముషీరాబాద్ నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి ప్రవీణ్ కుమార్ విచారణ చేపట్టి చిక్కడపల్లి పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఎన్నికల సిబ్బంది క్షేత్రస్థాయిలో జరిపిన సమగ్ర విచారణలో, దరఖాస్తుల్లో పేర్కొన్న 30 మంది ఓటర్లు దశాబ్దాలుగా తమ అధికారిక చిరునామాల్లోనే నివసిస్తున్నట్లు నిర్ధారణ అయింది. దురుద్దేశపూర్వకంగా తప్పుడు ఆధారాలతో ఓటర్ల హక్కులను కాలరాసేందుకు ప్రయత్నించినందున బాలచందర్‌పై భారతీయ నర సంహిత, ప్రజాప్రతినిధుల చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఫారం-7 దుర్వినియోగంపై నమోదైన తొలి ఎఫ్ఐఆర్ ఇదే కావడం గమనార్హం. ఈ ఘటనపై కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. దీని వెనుక పెద్దఎత్తున కుట్ర దాగి ఉందని, ముందస్తుగా ప్రింట్ చేసిన దరఖాస్తుల మూలాలను వెలికితీసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం చేత విచారణ జరిపించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మరోవైపు ఈ ఆరోపణలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు ఖండించారు. ఈ ఘటనతో ముషీరాబాద్‌తో పాటు హైదరాబాద్‌లోని పలు నియోజకవర్గాల్లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.



# అనుభవమే నా గొప్ప ఆస్తి

## ప్రభుత్వ అధినేతగా పాతికేళ్ల ప్రస్థానంపై ప్రధాని మోదీ భావోద్వేగం

## 'ఈ 25 ఏళ్ల అనుభవం నాది కాదు.. దేశానికే చెందుతుంది'

## 'దేశం నాకు ఎంతో ఇచ్చింది.. అందుకే నా బాధ్యత మరింత ఎక్కువ'

## 'విజయాలు వినయాన్ని.. వ్యతిరేకత ప్రజాస్వామ్య శక్తిని నేర్పింది'

## మోదీ పాతికేళ్ల నాయకత్వాన్ని ప్రశంసిస్తూ కేంద్ర కేబినెట్ తీర్మానం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** గుజరాత్ ముఖ్యమంత్రిగా మొదలైన ప్రయాణం.. దేశ ప్రధానమంత్రిగా కొనసాగుతున్న ప్రస్థానం.. ప్రభుత్వ అధినేతగా నిరంతరంగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ తన రాజకీయ, వ్యక్తిగత జీవితంలోని అనుభవాలను దేశ ప్రజలతో పంచుకున్నారు. 2001 అక్టోబర్ 7న గుజ రాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోదీ.. 2014 నుంచి ప్రధానమంత్రిగా కొన సాగుతూ బుధవారంతో ప్రభుత్వ అధినేతగా పాతికేళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సంద ర్భంగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగించిన మోదీ.. తన 25 ఏళ్ల అనుభవమే అత్యంత విలువైన ఆస్తి అని పేర్కొన్నారు. ఆ అనుభవం వ్యక్తిగతంగా తనది కాదని, దేశానికే చెందుతుందని చెప్పారు. తన ప్రయాణం వ్యక్తిగత ఆశయాలతో కాకుండా ఒక లక్ష్యంతో సాగిందని పేర్కొంటూ.. ప్రజల విశ్వాసమే ఇంతకాలం సేవ చేసేందుకు అవ కాశం కల్పించిందన్నారు. తన చిన్ననాటి రోజులను గుర్తుచేసుకున్న మోదీ.. నేర్చుకోవాలనే తపన చిన్నప్పటి నుంచే తనలో ఉందన్నారు. జీవితంలోని ప్రతి సంఘటన ఏదో ఒక పాఠాన్ని నేర్పిందని, నేటికీ తనను తాను విద్యార్థిగానే భావిస్తానని చెప్పారు. విజయాలు, పరాజయాలు, విమర్శలు, వ్యతిరేకత.. అన్నింటి నుంచీ నేర్చుకుంటూ ముందుకు సాగినట్లు వివరించారు. ప్రజల విశ్వాసం తనకు బలాన్నిస్తే, వ్యతిరేకత ప్రజాస్వామ్య విలువలను మరింత లోతుగా అర్థం చేసుకునేలా చేసిందని పేర్కొన్నారు. దేశం తనకు ఎంతో ఇచ్చిందని, అందుకే దేశం పట్ల తన బాధ్యత మరింత ఎక్కువని మోదీ అన్నారు. 25 ఏళ్ల పాటు ప్రభుత్వ అధినేతగా కొనసాగుతానని తాను ఎన్నడూ ఊహించలేదని పేర్కొన్నారు. ప్రజలు, భారతీయ జనతా పార్టీ, ఎన్డీఏతోపాటు తన ప్రయాణంలో భాగమైన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించాలన్న లక్ష్యానికి మరింత అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. మరోవైపు మోదీ 25 ఏళ్ల నిరంతర నాయకత్వాన్ని ప్రశంసిస్తూ కేంద్ర కేబినెట్ ప్రత్యేక తీర్మానం ఆమోదించింది. గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన ఆయన పాలనా ప్రస్థానం నుంచి ప్రధానమంత్రిగా కొనసాగుతున్న నాయకత్వాన్ని ప్రస్తావిస్తూ.. 'దేశమే ప్రథమం–పౌరుడే తొలి ప్రాధాన్యం' అనే సూత్రంతో ముందుకు సాగుతున్నారని తీర్మా నంలో పేర్కొంది. సంక్షేమం, మౌలిక సదుపాయాలు, డిజిటల్ సేవలు, ఆర్థిక సంస్కర ణలు, జాతీయ భద్రత తదితర రంగాల్లో మోదీ నాయకత్వాన్ని కేబినెట్ కొనియాడింది. ఇదే సమావేశంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు దీర్ఘకాలిక ఈక్విటీ పెట్టుబడులను అందించేందుకు రూ.10 వేల కోట్లతో ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్ ఏర్పాటుకు కేంద్ర కేబినె ట్ ఆమోదం తెలిపింది. అలాగే రవాణా, లాజిస్టిక్స్ రంగాల్లో సమన్వయం, ప్రణాళిక, ప్రాజెక్టుల మదింపు కోసం ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ లాజిస్టిక్స్ అథారిటీ ఏర్పాటుకూ పచ్చజెండా ఊపింది.

# పెట్రోల్ బంక్ సీలింగ్‌కు వెళ్లిన అధికారి దారుణ హత్య!

**ముంబై, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** విధుల నిర్వహణలో భాగంగా పెట్రోల్ బంక్‌ను సీల్ చేసేందుకు వెళ్లిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సేల్స్ మేనేజర్‌ను బంకు యజమాని కుమారుడు కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన ఘాతుకం మహారాష్ట్రలో చోటుచేసుకుంది. హింగోలి జిల్లా చోంధి ప్రాంతంలో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకును సాంకేతిక సమస్యల కారణంగా గత మూడు నెలలుగా మూసివేశారు. ఈ క్రమంలో అక్టోబర్ 6న ఐఓసీ సేల్స్ మేనేజర్ మహేష్ షెల్కే తన బృందంతో కలిసి బంకును అధికారికంగా సీల్ చేయడానికి అక్కడకు వెళ్లారు. ఈ సమయంలో బంక్ ఆపరేటర్ సాహెబ్రావ్ పాండవీర్ కుటుంబ సభ్యులు తమకు బంకును పునఃప్రారంభించేందుకు మరో నెల రోజుల వ్యవధి ఇవ్వాలని కోరగా, ఇందుకు అధికారులు నిరాకరించారు. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన ఆపరేటర్ కుమారుడు ఉ మేష్ పాండవీర్, అధికారి మహేష్ షెల్కేపై కత్తితో ఏడుసార్లు విచక్షణారహితంగా దాడి చేశాడు. కడుపు, వీపు, ముఖ భాగాలపై తీవ్ర గాయాలవ్వడంతో షెల్కే అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయారు. ఘటన అనంతరం నిందితులు కార్లలో పరారవ్వగా, కురుండ పోలీస్ స్టేషన్‌లో హత్య కేసు నమోదైంది. నిందితుల కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. ఈ దారుణ హత్యను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ అర్విందర్ సింగ్ సాహ్నీ తీవ్రంగా ఖండించారు. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ సైతం ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకునేలా మహారాష్ట్ర ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. బాధితుడి కుటుంబానికి పెట్రోలియం మంత్రిత్వ శాఖ, ఐఓసీ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని హామీ ఇచ్చారు.





# ఢిల్లీలో మళ్లీ 'ఓటు' మంటలు!

- జంతర్ మంతర్‌కు వెళ్తున్న ఇండియా కూటమి ఎంపీలను అడ్డుకున్న పోలీసులు
- రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలు అదుపులోకి
- నేలపై పడుకుని ప్రియాంక నిరసన.. బస్సులపైకి ఎక్కి ఎంపీల నినాదాలు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ విపక్షాల పట్టు
- 'నాపై 45 ఎఫ్ఐఆర్‌లు.. ఒక్కో కేసు ఒక్కో మెడల్' అంటూ రాహుల్ వ్యాఖ్యలు





**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఇండియా కూటమి చేపట్టిన ఆందోళనతో దేశ రాజధాని ఢిల్లీ వరుసగా రెండోరోజూ ఉద్రిక్తంగా మారింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వైపు వెళ్తున్న ప్రతిపక్ష ఎంపీలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలు రోడ్డుపైనే నిరసనకు దిగారు. అనంతరం రాహుల్, ప్రి యాంకతోపాటు పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాహుల్‌ను రెండు రోజుల్లో మూడోసారి అదుపులోకి తీసుకున్నట్లు వార్తా సంస్థ రాయిటర్స్ వెల్లడించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆధ్వర్యంలో జన్‌పథ్‌లోని సాగర్ రత్నలో జరిగిన విపక్ష ఎంపీల సమావేశం అనంతరం నేతలు బస్సుల్లో జంతర్ మంతర్‌కు బయలుదేరారు. అయితే జన్‌పథ్–అశోకా రోడ్ కూడలి వద్దే పోలీసులు బస్సులను నిలిపివేశారు. దీంతో ఎంపీలు బస్సుల నుంచి దిగి ఆందోళనకు దిగగా, కొందరు బస్సులపైకి ఎక్కి నినాదాలు చేశారు.

### నేలపై పడుకుని ప్రియాంక నిరసన

పోలీసులు తమను ముందుకు వెళ్లనివ్వకపోవడంతో ప్రియాంక గాంధీ రోడ్డుపై కూర్చుని, అనంతరం నేలపై పడుకుని నిరసన వ్యక్తం చేశారు. ఆమెను అక్కడి నుంచి తరలించే క్రమంలో మహిళా పోలీసులతో పెనుగులాట చోటుచేసుకుంది. తనను బలవంతంగా ఈడ్చుకెళ్లారని, ఈ క్రమంలో గాయాలయ్యాయని ప్రియాంక ఆరోపించారు. జంతర్ మంతర్‌లో ఆందోళన చేపట్టేందుకు ముందస్తు అనుమతి అవసరమని ఢిల్లీ పోలీసులు పేర్కొన్నారు. అక్కడ నిరసన కార్యక్రమాలకు కనీసం పది రోజుల ముందుగా అనుమతి కోరాల్సి ఉంటుందని, జనసమీకరణపై కూడా పరిమితులు ఉన్నాయని పోలీసులు స్పష్టం చేశారు.

### 'ఒక్కో ఎఫ్ఐఆర్.. ఒక్కో మెడల్'

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ తనపై నమోదవుతున్న కేసులపై తీవ్రంగా స్పందించారు. తనపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని, అవి వందకు చేరినా వెనక్కి తగ్గబోనని చెప్పారు. "నాపై నమోదయ్యే ప్రతి ఎఫ్ఐఆర్ నా ఛాతీపై ఒక మెడల్‌తో సమానం" అంటూ వ్యాఖ్యానించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ విషయంలో ఎన్నికల సంఘం తీరుపై వారు ఆరోపణలు చేస్తున్నారు. అయితే ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న విపక్షాల ఆరోపణలను ఎన్నికల సంఘం, బీజేపీ తిరస్కరిస్తున్నాయి. మంగళవారం కూడా రాహుల్, ప్రియాంక సహా విపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయం వైపు మార్చ్ చేపట్టగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆకాశవాణి భవన్ వద్ద సుదీర్ఘంగా బైఠాయించిన నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం మరోసారి ఆందోళనకు దిగడంతో ఢిల్లీలో రాజకీయ వేడి మరింత పెరిగింది.



# 'సర్'లో పేరు మిస్సయిందా? మళ్లీ ఓటరయ్యే ఛాన్స్!

## ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం ప్రత్యేక డ్రైవ్

### 'సర్' పూర్తయిన 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలు

### పాత-కొత్త జాబితాలను పోల్చి గల్లంతైన అర్హుల గుర్తింపు




**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** ఓటర్ల జాబితాలో మీ పేరు ఉండేది.. 'సర్' తర్వాత కనిపించడం లేదా?.. అయితే మళ్లీ నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తయిన 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జాబితా నుంచి మిగిలిపోయిన అర్హులైన ఓటర్లతోపాటు తొలిసారి ఓటు హక్కు పొందుతున్న యువతను నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ మేరకు సెప్టెంబర్ 29న ఆదేశాలు జారీ చేసి, అక్టోబర్ 1న రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మరోసారి స్పష్టం చేసింది. 'సర్'కు ముందు ఓటర్ల జాబితాలో పేరు ఉండి, సవరణ అనంతరం ప్రస్తుత జాబితాలో కనిపించని వారి వివరాలను గుర్తించనున్నారు. ఇందుకోసం బూత్ స్థాయి అధికారులు పాత, కొత్త ఓటర్ల జాబితాలను సరిపోల్చి పరిశీలిస్తారు. అవసరమైన చోట ఇంటింటికీ వెళ్లి వివరాలను ధ్రువీకరిస్తారు. అర్హులుగా తేలిన వారు తిరిగి ఓటర్లుగా నమోదు కావడానికి ఫారం–6 దరఖాస్తు సమర్పించేందుకు సహకరిస్తారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల సంఘం నిర్దిష్ట కార్యాచరణను రూపొందించింది. ఒక్కో బీఎల్ఓ వారానికి 20 నుంచి 25 మంది వరకు జాబితా నుంచి మిగిలిపోయిన ఓటర్లను పరిశీలించాలని, నెల రోజుల్లో ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించింది. కొత్తగా అర్హత పొందిన యువ ఓటర్ల నుంచి కూడా ఫారం–6 దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఓటర్ల నమోదును సులభతరం చేసేందుకు బూత్ స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. 'సర్' సమయంలో ఫారం–6తోపాటు అమల్లో ఉన్న అదనపు డిక్లరేషన్‌ను, 'సర్' పూర్తయిన రాష్ట్రాల్లో ఈ ప్రత్యేక నమోదు కార్యక్రమానికి వర్తింపజేయరు. సాధారణంగా అమల్లో ఉన్న ఫారం–6 ద్వారానే అర్హులు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోయాయంటూ ప్రతిపక్ష పార్టీలు, పౌర సంఘాల నుంచి విమర్శలు, నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ప్రత్యేక డ్రైవ్ ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆదేశాలు సెప్టెంబర్ 29నే జారీ అయ్యాయి. అందువల్ల తాజాగా జరుగుతున్న నిరసనలకు ప్రతిస్పందనగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్ధారించి చెప్పడం సరికాదు. ఎన్నికల సంఘం మాత్రం అర్హులైన ఏ ఓటరూ జాబితా నుంచి మిగిలిపోకుండా చూడటమే కార్యక్రమ లక్ష్యమని పేర్కొంది.

# ఢిల్లీలో కూలిన ఐదంతస్తుల భవనం.. ముగ్గురు మృతి!

## సీమాపురిలో ఒక్కసారిగా కుప్పకూలిన నివాస భవనం

## మృతుల్లో చిన్నారి.. మరో ఎనిమిది మందికి గాయాలు

## శిథిలాల కింద మరికొందరు ఉన్నట్లు అనుమానం..



**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** దేశ రాజధాని ఢిల్లీలో ఘోర ప్రమా దం చోటుచేసుకుంది. ఈశాన్య ఢిల్లీలోని సీమాపురి ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం ఐదంతస్తుల నివాస భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. తాజా సమాచారం ప్రకారం ఈ ప్రమాదంలో చిన్నారి సహా ముగ్గురు మృ తి చెందగా, ఎనిమిది మంది గాయపడ్డారు. మరికొందరు శిథిలాల కింద చిక్కుకుని ఉండొచ్చన్న అనుమానంతో సహాయక బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. సీమాపురిలోని చేపల మార్కెట్ వెనుక ప్రాంతంలో మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే నాలుగు అగ్నిమాపక వాహనాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. స్థానికులు సైతం శిథిలాలను తొలగిస్తూ బాధితులను బయటకు తీసేందుకు సహకరించారు. భవనం కూలిన ప్రభావంతో పక్కనే ఉన్న రెండు భవనాలు కూడా పాక్షి కంగా దెబ్బతిన్నట్లు సమాచారం. శిథిలాల కింద ఇంకా కొందరు చిక్కు కుని ఉండవచ్చన్న అనుమానంతో భారీ యంత్రాల సహాయంతో కాంక్రీట్ శ్లాబ్‌లు, శిథిలాలను తొలగిస్తున్నారు. గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంతో సీమాపురి పరిసరాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అంబులెన్స్‌లు, సహాయక వాహ నాల రాకపోకలకు ఆటంకం కలగకుండా ఘటనాస్థలి పరిసరాల్లో గుమి గూడవద్దని అధికారులు ప్రజలను కోరారు. భవనం కూలిపోవడానికి కచ్చితమైన కారణం ఏమిటన్నది ఇంకా అధికారికంగా నిర్ధారణ కాలేదు. సహాయక చర్యలు పూర్తయిన తర్వాతే ప్రమాద తీవ్రతపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# కొమురం భీం పోరాట స్ఫూర్తితో జర్నలిస్టులు ఉద్యమించాలి



## టీయూడబ్ల్యూజే జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

### జిల్లా అధ్యక్షుడిగా అబ్దుల్ రహమాన్

### కార్యదర్శిగా ఎస్ సంపత్ కుమార్





**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అబ్దుల్ రహమాన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకాశ్ గౌడ్, సహాయ ఎన్నికల అధికారి నరేష్ తెలిపారు. టీయూడబ్ల్యూజే--ఐజేయూ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా శాఖకు సంబంధించి అధ్యక్షుడితో పాటు వివిధ హోదాల్లో నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా అబ్దుల్ రహమాన్ జిల్లా ఉపాధ్యక్షులుగా నవీన్ గౌడ్, కేంద్రే చంద్రకాంత్, మేకల శ్రీనివాస్, వారణాసి శ్రీనివాస్, భూక్య గిరిజ పరశురాం, జిల్లా కార్యదర్శి గా ఎస్. సంపత్ కుమార్ , జిల్లా సహాయ కార్యదర్శులుగా చిలుకూరి రాధాకృష్ణ, కడతల సాయి, దూడ గోపి, చవహన్ రామేశ్వర్, అహ్మద్ పాషా, జిల్లా కోశాధికారిగా అడప సతీష్, సంయుక్త కార్యదర్శులుగా టి. అమూల్ గౌడ్, బైరగోని రాజు, బి. మహేష్, ఎండీ నౌషాద్, దేవునూరి రమేష్, కార్యవర్గ సభ్యులుగా కాంబ్లే అన్నారావు, ఇప్ప పోచయ్య, నామ తిరుపతి, కమలాకర్, బాల ప్రసాద్ గౌడ్, జాదవ్ రోహిదాస్, సాయి సృజన్, అహ్మద్ అమీన్, రాథోడ్ రమేష్ లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం జిల్లాలోని జర్నలిస్టుల సమస్యలు, హక్కుల సాధన కోసం ఐక్యంగా పనిచేస్తుందని ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, జిల్లా కార్యదర్శి ఎస్ సంపత్ కుమార్ తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన హక్కుల పరిరక్షణ, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం సంఘం తరఫున నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన కార్యవర్గ ఎన్నిక పట్ల జిల్లా జర్నలిస్టులు, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, జిల్లా నాయకులు విరికి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిటీ ఎన్నిక పట్ల సభ్యులు హర్షం వ్యక్తం చేసి నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

- టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కే విరాహత్ అలీ



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జోడేఘాట్ సాక్షిగా, జల్.. జంగల్.. జమీన్ తమ హక్కుగా గర్జించి, అణచివేతకు ఎదురు నిలిచి, అన్యాయానికి తలవంచకుండా, ఆదివాసీ బిడ్డల ఆత్మగౌరవం కోసం ఎదురొడ్డి పోరాడిన వీరుడు కొమురం భీం పోరాట స్ఫూర్తితో జర్నలిస్టులు హక్కుల సాధనకై ఉద్యమించాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ పిలుపు నిచ్చారు. బుధవారం టీయూడబ్ల్యూజే కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తృతీయ మహాసభ, ఆసిఫాబాద్ పట్టణంలోని ఏ రోజ్ గార్డెన్స్ ఫంక్షన్ హాలులో, కొమురం భీం ప్రాంగణంలో జరిగింది. ఈ సభకు ఆయన విశిష్ట అథితిగా హాజరై ప్రసంగించారు. ఆసిఫాబాద్ అంటే అడవి మాత్రమే కాదని, ఆదివాసీ బిడ్డల ఆత్మగౌరవానికి అది చిరునామా అని విరాహత్ అభివర్ణించారు. ఆసిఫాబాద్ ఒక జిల్లా మాత్రమే కాదని, కొమురం భీం పోరాట వారసత్వాన్ని మోస్తున్న నేల అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పోరాటాలు, త్యాగాలు, విజయాలతో కూడిన సుదీర్ఘ చరిత్ర కలిగి ఉన్న ఏకైక సంఘం టీయూడబ్ల్యూజే మాత్రమేనని ఆయన స్పష్టం చేసారు. జర్నలిస్టుల గొంతుకగా, 75ఏళ్ల నుండి మడమ తిప్పని పోరాటాలు చేస్తున్న గొప్ప చరిత్ర తమ సంఘానికి ఉందని, తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులు పొందుతున్న సౌకర్యాలు తమ సంఘం సాధించినవేనని ఆయన స్పష్టం చేసారు. నాటి నుండి నేటి వరకు తమ సంఘం ఏ రాజకీయ పార్టీకో, ప్రభుత్వానికో అనుబంధంగా పనిచేయలేదని, జర్నలిస్టుల, మీడియా పక్షపాతిగా నిలబడి రాజీలేని పోరాటాలు కొనసాగిస్తున్నట్లు విరాహత్ అలీ అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించడం సరైంది కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు క్యాష్ లెస్ హెల్త్ స్కీమ్ అమలుకాక



పోవడంతో అప్పులు చేసి చికిత్స పొందుతున్నారని, మరి కొందరు అప్పులు చేసే స్థోమత లేక అనారోగ్యాలతో తనువు చాలిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేసారు. అలాగే ఇండ్లు, ఇంటి స్థలాల హామీని ప్రభుత్వం నేటికీ అమలు చేయకపోవడంతో జర్నలిస్టుల్లో తీవ్ర నిరాశ నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జర్నలిస్టుల ప్రధాన సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కరానికి కృషి చేయాలని విరాహత్ అలీ కోరారు. గౌరవ అథితిగా హాజరైన టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ మాట్లాడుతూ, ట్రేడ్ యూనియన్ నియమావళికి అనుగుణంగా సంస్థాగత నిర్మాణంతో రాష్ట్రంలో కొనసాగుతున్న ఏకైక జర్నలిస్టుల సంఘం తమదేనని ఆయన పేర్కొన్నారు. 33జిల్లాల్లో వేలాది జర్నలిస్టుల సభ్యత్వాలతో తమ సంఘం శాఖలు బలోపేతంగా పనిచేస్తున్నట్లు రాంనారాయణ స్పష్టం చేసారు. జర్నలిస్టుల సంక్షేమం తప్పా, వేరే వ్యామోహాలు తమకు లేవని ఆయన అన్నారు. ఇంకా ఈ సభలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాష్ రెడ్డి, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ రహ్మాన్, సంపత్, యూనియన్ జిల్లా నాయకులు కృష్ణం రాజు, ప్రకాష్ గౌడ్, జమీల్, గిరిజా బాయి, సతీష్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుండి దాదాపు 250మంది జర్నలిస్టులు మహాసభకు హాజరవ్వడం విశేషం.



### కథనాల్లో వాస్తవాలు ఉండాలి : కలెక్టర్ హరిత

ప్రజా సమస్యలపై జర్నలిస్టులు రాసే కథనాల్లో వాస్తవాలు ఉంటేనే అవి విశ్వాసం పొందగలుగుతాయని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. టీయూడబ్ల్యూజే మహాసభకు ఆమె ముఖ్య అథితిగా హాజరై ప్రసంగించారు. ప్రజా క్షేత్రంలో అధికార యంత్రాంగంతో కలిసి జర్నలిస్టులు టీమ్ వర్క్ చేస్తే సత్ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని కలెక్టర్ సూచించారు. జిల్లాలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు.





## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### టీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి ఎస్ సంపత్ కుమార్

**ఉద్యమ కెరటం , ఆసిఫాబాద్ టౌన్:** జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కోసం తన వంతు పూర్తి కృషి చేస్తానని టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కార్యదర్శి ఎస్ సంపత్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన టియుడబ్ల్యూజే జిల్లా మూడవ మహాసభలో ఆయన జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన టియుడబ్ల్యూజే రాష్ట్ర నాయకులకు, జిల్లా జర్నలిస్టులకు ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని తెలిపారు. తనను మూడోసారి జిల్లా కార్యదర్శిగా ఎన్నుకోవడం పట్ల అయిన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టీయూడబ్ల్యూజే బలోపేతానిక్ కృషి చేస్తానని తెలిపారు.



## జర్నలిస్టుల నమ్మకమే నా ఊపిరి

### జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధన కోసం పోరాడుతా

### టీయూడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడిగా 3వ సారి ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు

### టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్





**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడిగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్న సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని టీయూడబ్ల్యూజే మూడవ టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ జిల్లాలోని ప్రతి ఒక్క జర్నలిస్ట్ మిత్రులకు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత రెండు విడతలుగా జిల్లాలోని పాత్రికేయుల సమస్యలపై, ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు, హెల్త్ కార్టులు, ఐక్యత కోసం యూనియన్ పరంగా అనేక పోరాటాలు చేశాం అన్నారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్నానన్నారు. ఇప్పుడు 3వ సారి కూడా నాపై పూర్తి నమ్మకంతో ఈ గురుతర బాధ్యతను అప్పగించడం నాపై మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా జిల్లాలోని ప్రతి ఒక్క జర్నలిస్ట్ సంక్షేమానికి, వారి హక్కుల పరిరక్షణకు, అన్యాయానికి గురైన పాత్రికేయుల తరఫున పోరాడేందుకు టీయూడబ్ల్యూజే ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేస్తున్నాను. టీయూడబ్ల్యూజే బలోపేతానికి తన వంతు పూర్తి కృషి చేస్తానని తెలిపారు. ఐక్యతే మహాబలం అని జర్నలిస్టులు ఐక్యంగా ఉండి హక్కుల సాధన కోసం ముందుకు రావాలని కోరారు. ఈ ఎన్నికలో నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి సహకరించిన యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామనారాయణ, జిల్లా, మండల స్థాయి నాయకులకు, సభ్యులకు పేరుపేరునా నా హృదయపూర్వక కృతజ్ఞతలు.



టీయూడబ్ల్యూజే కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మూడో మహాసభకు హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామనారాయణ, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, జర్నలిస్టులు



ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్

## కలం ఒక్కటైంది..

హక్కుల కోసం గళమెత్తింది!







మహాసభలో మాట్లాడుతున్న కలెక్టర్





# హక్కుల కోసం జర్నలిస్టుల గొంతుక

### ఘనంగా టీయూడబ్ల్యూజే కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మూడో మహాసభ

## జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన జర్నలిస్టులు

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జర్నలిస్టుల హక్కుల సాధన, పరిరక్షణే లక్ష్యంగా టీయూడబ్ల్యూజే కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మూడో మహాసభ బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగింది. మహాసభకు జిల్లాలోని నలుమూల ప్రాంతాల నుంచి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ అధ్యక్షతన జరిగిన మహాసభకు జిల్లా కలెక్టర్ కె. హరిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ విశిష్ట అతిథిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధనతోపాటు వాటి పరిరక్షణకు ఐక్యంగా ముందుకు సాగాలన్న సంకల్పంతో నిర్వహించిన ఈ మహాసభ జర్నలిస్టుల సమష్టి చైతన్యానికి వేదికగా నిలిచింది. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి పాత్రికేయులు తరలిరావడంతో మహాసభ సందడిగా సాగింది.









# హర్మన్‌ప్రీత్ సేవలు మరువలేం

## స్మృతి మంధాన భావోద్వేగ పోస్టు..

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** భారత మహిళా క్రికెట్ జట్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. జింబాబ్వే సిరీస్‌కు ముందు జట్టు రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అన్ని ఫార్మాట్ల కెప్టెన్సీకి రాజీనామా చేశారు. ఆమె స్థానంలో స్టార్ ఓపెనర్ స్మృతి మంధానను కొత్త కెప్టెన్‌గా బీసీసీఐ నియమించింది. గువాహటిలో జరిగిన బీసీసీఐ సమీక్ష సమావేశం తర్వాత హర్మన్‌ప్రీత్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా స్మృతి మంధాన మాజీ కెప్టెన్ గురించి సోషల్ మీడియా వేదికగా భావోద్వేగపూరితమైన పోస్టు చేశారు. తమ దశాబ్ద కాలపు నాయకత్వంలో హర్మన్‌ప్రీత్ దేశానికి అద్భుత విజయాలను అందించారని మంధాన కొనియాడారు. నవంబర్ 2025లో తొలి వన్డే ప్రపంచ కప్‌తో పాటు 2023, 2026 ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు సాధించిపెట్టడంలో ఆమె పాత్ర గొప్పదని ప్రశంసించారు. ఆట పట్ల ఉన్న మక్కువ కేవలం ప్రేమ, అభిరుచితోనే ఆడాలని భావిస్తున్నట్లు హర్మన్‌ప్రీత్ తెలిపారు. కెప్టెన్‌గా తప్పుకున్నప్పటికీ, ఆమె జింబాబ్వే సిరీస్‌కు ఎంపికైన జట్టులో కొనసాగనున్నారు. మరోవైపు, గాయంతో జట్టుకు దూరంగా ఉన్న జెమిమా రోడ్రిగ్స్ కూడా హర్మన్‌ప్రీత్ సేవలను కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల చివర్లో జింబాబ్వేతో జరిగే దేశీయ టీ20, వన్డే సిరీస్‌ల ద్వారా స్మృతి మంధాన పూర్తి స్థాయి కెప్టెన్‌గా తన బాధ్యతలను ప్రారంభించనున్నారు.

# తన్మయ్ స్పిన్ సునామీ

## యూత్ టెస్టులో ప్రపంచ రికార్డు నెలకొల్పిన తన్మయ్ బలోడా

**అహ్మదాబాద్, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** ఆఖరి నిమిషంలో జట్టులో చోటు.. అవకాశం వచ్చిందని బరిలోకి దిగాడు.. స్పిన్‌తో ఆసీస్‌ను చుట్టేశాడు.. ఏకంగా 19 ఏళ్ల ప్రపంచ రికార్డునే తిరగరాశాడు! భారత అండర్-19 యువ స్పిన్నర్ తన్మయ్ బలోడా అద్భుత ప్రదర్శనతో యూత్ టెస్టు క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఆస్ట్రేలియాతో జరిగిన రెండో యూత్ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 73 పరుగులిచ్చి 14 వికెట్లు పడగొట్టి యూత్ టెస్టు చరిత్రలో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేశాడు. రోహిత్ యాదవ్ స్థానంలో ఆఖరి నిమిషంలో జట్టులోకి వచ్చిన తన్మయ్.. వచ్చిన అవకాశాన్ని రెండు చేతులా అందిపుచ్చుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు పడగొట్టిన అతడు.. రెండో ఇన్నింగ్స్‌లో మరింత చెలరేగి ఎనిమిది వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో మ్యాచ్ మొత్తంలో 14 వికెట్లు సాధించి ఆస్ట్రేలియా బ్యాటింగ్ వెన్నువిరిచాడు. ఇప్పటివరకు ఈ రికార్డు న్యూజిలాండ్ స్టార్ పేసర్ టిమ్ సౌథీ పేరిట ఉండేది. 2007లో భారత అండర్-19 జట్టుతో జరిగిన యూత్ టెస్టులో సౌథీ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 92 పరుగులిచ్చి 12 వికెట్లు పడగొట్టాడు. తాజాగా తన్మయ్ 73 పరుగులకే 14 వికెట్లు పడగొట్టి ఆ 19 ఏళ్ల రికార్డును అధిగమించాడు. తన్మయ్ స్పిన్ ధాటికి ఆస్ట్రేలియా బ్యాటర్లు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ తడబడ్డారు. తొలి ఇన్నింగ్స్‌లో 174 పరుగులకు ఆలౌటైన ఆసీస్.. రెండో ఇన్నింగ్స్‌లో 151 పరుగులకే పరిమితమైంది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 315 పరుగులు చేయడంతో విజయానికి కేవలం 11 పరుగుల లక్ష్యం మాత్రమే మిగిలింది. స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన భారత ఓపెనర్లు తొలి ఓవర్‌లోనే రెండు బౌండరీలు బాది విజయాన్ని ఖాయం చేశారు. దీంతో భారత్ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించడంతోపాటు రెండు మ్యాచ్‌ల యూత్ టెస్టు సిరీస్‌ను 2--0తో క్లీన్‌స్వీప్ చేసింది.



# మ్యాచ్ వేళ.. స్టేడియానికి బాంబు బెదిరింపు!

- అహ్మదాబాద్‌లో కలకలం.. స్టేడియంతోపాటు పది పాఠశాలలకు బెదిరింపు మెయిల్స్
- స్టేడియంలోనే భారత్-ఆస్ట్రేలియా అండర్-19 జట్లు.. అప్రమత్తమైన అధికారులు
- పాఠశాలల నుంచి విద్యార్థులను ఇళ్లకు పంపించిన యాజమాన్యాలు
- బాంబు నిర్వీర్య బృందాలతో విస్తృత తనిఖీలు.. రంగంలోకి సైబర్ క్రైమ్ పోలీసులు
- దిల్‌జీత్ దోసాంజ్ సంగీత విభావరిని ప్రస్తావిస్తూ బెదిరింపులు



**అహ్మదాబాద్, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** భారత్-ఆస్ట్రేలియా అండర్-19 జట్ల మ్యాచ్ జరుగుతున్న వేళ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియానికి బాంబు బెదిరింపు రావడం తీవ్ర కలకలం రేపింది. స్టేడియంతోపాటు నగరంలోని పది ప్రముఖ పాఠశాలలను పేల్చేస్తామంటూ ఈమెయిల్ సందేశాలు రావడంతో పోలీసులు, భద్రతా బలగాలు ఒక్కసారిగా అప్రమత్తమయ్యాయి. ముందస్తు జాగ్రత్తగా పాఠశాలల్లోని విద్యార్థులను ఇళ్లకు పంపించగా.. బాంబు నిర్వీర్య బృందాలు రంగంలోకి దిగి విస్తృత తనిఖీలు చేపట్టాయి. ముఖ్యంగా పశ్చిమ అహ్మదాబాద్‌లోని పాఠశాలలను లక్ష్యంగా చేసుకుని బెదిరింపు ఈమెయిల్స్ వచ్చినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. సమాచారం అందుకున్న వెంటనే ఆయా పాఠశాలల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా వారిని వేగంగా ఇళ్లకు పంపించారు. బెదిరింపులు వచ్చిన సమయంలో నరేంద్ర మోదీ స్టేడియం ప్రాంగణంలో భారత అండర్-19, ఆస్ట్రేలియా అండర్-19 జట్లు ఉండటంతో ఆందోళన మరింత పెరిగింది. ఉదయం 11.15 గంటలకే యూత్ టెస్ట్ మ్యాచ్ ముగియగా, మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత క్రీడాకారులు క్షేమంగా తమ బసకు బయలుదేరి వెళ్లారు. నవంబర్ 21న ఇదే స్టేడియంలో జరగనున్న ప్రముఖ గాయకుడు దిల్‌జీత్ దోసాంజ్ సంగీత విభావరిని కూడా బెదిరింపు ఈమెయిల్స్‌లో ప్రస్తావించినట్లు సమాచారం. ఆ కార్యక్రమానికి హాజరయ్యే వారికి రక్షణ ఉండదంటూ హెచ్చరికలు చేసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. బెదిరింపుల సమాచారం అందుకున్న గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి అనిల్ పటేల్ వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులతోపాటు స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బాంబు నిర్వీర్య బృందాలు, అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు స్టేడియం సహా బెదిరింపులు వచ్చిన ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు బెదిరింపు ఈమెయిల్స్ ఎక్కడి నుంచి వచ్చాయి?.. వాటిని పంపింది ఎవరు?.. దీని వెనుక ఉద్దేశమేంటి? అనే కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు.

# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో శ్రేయాస్ అయ్యర్ ధమాకా

## టాప్-10లో నలుగురు భారత బ్యాటర్లు!



**దుబాయ్, అక్టోబర్ 07 (ఉద్యమ కెరటం):** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన పురుషుల టీ20, వన్డే ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు అత్యుత్తమ స్థానాల్లో నిలిచి తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. లక్నో వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20లో కేవలం 43 బంతుల్లోనే 10 ఫోర్లు, 6 సిక్సర్లతో అజేయంగా 102 పరుగులు సాధించిన భారత టీ20 కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ సుదీర్ఘ లీప్ తీసుకున్నారు. ఈ విధ్వంసక సెంచరీతో ఏకంగా 18 స్థానాలు ఎగబాకిన అయ్యర్, తన కెరీర్‌లోనే అత్యుత్తమంగా 7వ ర్యాంక్‌కు చేరుకున్నారు. ప్రస్తుతం టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ ఇషాన్ కిషన్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, అభిషేక్ శర్మ రెండో స్థానాన్ని, తిలక్ వర్మ 10వ స్థానాన్ని నిలబెట్టుకున్నారు. అయ్యర్ 7వ స్థానానికి రావడంతో ఐసీసీ టాప్-10 టీ20 బ్యాటర్లలో ఏకంగా నలుగురు భారతీయులే ఆక్రమించడం విశేషం. మరోవైపు, ఏషియన్ గేమ్స్ 2026లో రాణించిన 15 ఏళ్ల యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 8 స్థానాలు మెరుగుపరుచుకుని 46వ ర్యాంక్‌కు చేరగా, పాకిస్థాన్‌కు చెందిన హసన్ నవాజ్ 62 స్థానాలు ఎగబాకి 48వ స్థానంలో నిలిచారు. టీ20 బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్తాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ మళ్లీ నంబర్-1 స్థానాన్ని కైవసం చేసుకోగా, భారత లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అక్షర్ పటేల్ 16 స్థానాలు ఎగబాకి 7వ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నారు. ఇక వన్డే ఫార్మాట్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు. గువాహటిలో వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో అజేయంగా 223 పరుగులు చేసి కెరీర్‌లో రెండో డబుల్ సెంచరీ సాధించిన గిల్, తన కెరీర్ బెస్ట్ 841 రేటింగ్ పాయింట్లను సమం చేసుకున్నాడు. ఈ సిరీస్‌లో మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ మూడో స్థానానికి పడిపోగా, మూడో వన్డేలో శతకం బాదిన కేఎల్ రాహుల్ 7 స్థానాలు ఎగబాకి తిరిగి టాప్-10లోకి అడుగుపెట్టాడు. వెస్టిండీస్‌తో జరిగిన ఈ మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత్ 2-1 తేడాతో గెలుచుకుంది.

# టీమ్ ఎంపికలో ఇక 'లక్ష్మణ్' ముద్ర!

## బీసీసీఐ కీలక నిర్ణయం.. ప్రతి సీనియర్ సెలెక్షన్ సమావేశానికి వీవీఎస్ లక్ష్మణ్

## ఆటగాళ్ల గాయాలు, ఫిట్‌నెస్, పునరావాసంపై సెలెక్టర్లకు నేరుగా సమాచారం

## సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్--సెలెక్షన్ కమిటీ మధ్య సమన్వయానికి కొత్త అడుగు



**ముంబై, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** టీమిండియా ఎంపిక ప్రక్రియలో హైదరాబాద్ దిగ్గజం వీవీఎస్ లక్ష్మణ్‌కు కీలక పాత్ర దక్కనుంది. ఇకపై సీనియర్ సెలెక్షన్ కమిటీ నిర్వహించే ప్రతి సమావేశానికి బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధిపతిగా ఉన్న లక్ష్మణ్ హాజరుకానున్నారు. ముఖ్యంగా ఆటగాళ్ల గాయాలు, ఫిట్‌నెస్, పునరావాసం, తిరిగి జట్టుకు అందుబాటులోకి వచ్చే సమయం వంటి అంశాలపై సెలెక్టర్లకు కచ్చితమైన సమాచారం అందించేందుకు బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవల గువాహటిలో జరిగిన టీ20, ఇండియా-ఏ జట్ల ఎంపిక సమావేశాల్లోనూ లక్ష్మణ్ పాల్గొన్నారు. ఇకపై సీనియర్ జట్టు ఎంపిక సమావేశాల్లో ఆయన క్రమం తప్పకుండా భాగస్వామి కానున్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆటగాళ్ల ఫిట్‌నెస్, గాయాలు, పునరావాస ప్రక్రియను పర్యవేక్షించే వ్యవస్థకు లక్ష్మణ్ నేతృత్వం వహిస్తున్న నేపథ్యంలో ఆయన నుంచి నేరుగా సమాచారం పొందడం సెలెక్టర్లకు ఉపయోగపడుతుందని బీసీసీఐ భావిస్తోంది. గాయపడిన ఆటగాడు ఎప్పుడు కోలుకుంటాడు?.. జట్టు ఎంపిక సమయానికి అందుబాటులో ఉంటాడా?.. అతడి ప్రస్తుత ఫిట్‌నెస్ పరిస్థితి ఏంటి?.. పునరావాస ప్రక్రియ ఎంతవరకు వచ్చింది?.. వంటి అంశాలపై ఇకపై సెలెక్షన్ సమావేశంలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది. లక్ష్మణ్ నేరుగా సమావేశాల్లో పాల్గొనడం ద్వారా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, సెలెక్టర్ల మధ్య సమాచార లోపాలకు అవకాశం లేకుండా చూడాలన్నది బోర్డు ఉద్దేశం. మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ హయాంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, సెలెక్షన్ కమిటీ మధ్య సమాచార సమన్వయంలో కొన్ని సమస్యలు ఎదురైనట్లు సమాచారం. ముఖ్యంగా గాయపడిన ఆటగాళ్ల ఫిట్‌నెస్, తిరిగి అందుబాటులోకి వచ్చే సమయంపై సెలెక్టర్లకు ఎప్పటికప్పుడు పూర్తి సమాచారం అందని సందర్భాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే వ్యవస్థలో సమన్వయాన్ని పెంచేందుకు తాజా మార్పు చేసినట్లు చెబుతున్నారు. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా సైతం ఈ నిర్ణయంపై స్పష్టత ఇచ్చారు. ముంబైలో జరిగిన సమీక్ష సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సీఓఈ అధిపతిగా ఉన్న లక్ష్మణ్ ఇకపై అన్ని సీనియర్ సెలెక్షన్ సమావేశాలకు హాజరై సెలెక్టర్లకు అవసరమైన సమాచారం అందిస్తారని పేర్కొన్నారు. అజిత్ అగార్కర్ చీఫ్ సెలెక్టర్ బాధ్యతల నుంచి తప్పుకున్న తర్వాత మాజీ భారత స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా ప్రస్తుతం సెలెక్షన్ కమిటీకి తాత్కాలిక చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ మార్పుల నేపథ్యంలో జట్టు ఎంపిక వ్యవస్థలోనూ బీసీసీఐ పలు కీలక మార్పులకు శ్రీకారం చుడుతోంది.





# నన్ను సరిగ్గా అంచనా వేయక..

### తక్కువ సినిమాలు చేయడానికి కారణం చెప్పిన శ్రీనిధి శెట్టి

**హైదరాబాద్, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** 'కేజీఎఫ్'తో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నా.. ఆ తర్వాత ఆశించిన స్థాయిలో సినిమాలు చేయలేకపోవడానికి కారణమేంటో నటి శ్రీనిధి శెట్టి వెల్లడించారు. తాను కావాలనే సినిమాల సంఖ్య తగ్గించుకోవడం లేదని, మంచి అవకాశాలు వస్తే ఏడాదికి నాలుగైదు చిత్రాల్లో నటించేందుకు కూడా సిద్ధమేనని స్పష్టం చేశారు. తన టైమింగ్ కలిసి రాకపోవడం లేదా మేకర్స్ తన సామర్థ్యాన్ని సరిగ్గా అంచనా వేయకపోవడం వల్ల అనుకున్నన్ని అవకాశాలు రాలేదేమోనని అభిప్రాయపడ్డారు. వెంకటేష్ హీరోగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం'లో ప్రస్తుతం శ్రీనిధి శెట్టి నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్, సినిమాల ఎంపిక గురించి ఆమె ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "గత కొన్నేళ్లుగా నేను చాలా తక్కువ సినిమాలు చేస్తున్నానని అందరూ నన్ను సెలక్టివ్ అనుకుంటున్నారు. నిజానికి కెమెరా ముందు నటించడమంటే నాకు చాలా ఇష్టం. మంచి అవకాశాలు వస్తే ఏడాదికి నాలుగు, ఐదు సినిమాలు చేయడానికి కూడా సిద్ధమే. అయితే మంచి కథతోపాటు ఆసక్తికరమైన టీమ్ కుదరాలి" అని శ్రీనిధి చెప్పారు. కొన్నిసార్లు తనకు సరైన సమయంలో సరైన అవకాశాలు రాలేదేమోనని అనిపిస్తుందని తెలిపారు. "నా టైమింగ్ బాగోలేకపోవడం కావచ్చు.. లేదా మేకర్స్ నన్ను సరిగ్గా అంచనా వేయలేకపోవడం కావచ్చు. అందుకే అనుకున్నన్ని అవకాశాలు రాలేదేమో. ఒక్కోసారి నేను మంచి నటిని కాదేమో.. అందుకే అవకాశాలు ఇవ్వడం లేదేమో అనే ఆలోచన కూడా వస్తుంది" అని పేర్కొన్నారు. తన గురించి తాను ఎప్పుడూ అతిగా ఊహించుకోనని, వాస్తవానికి దగ్గరగా ఉండేందుకే ప్రయత్నిస్తానన్నారు. కొత్త దర్శకుడైనా, అగ్ర దర్శకుడైనా తనకు అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతతో ఉంటానని చెప్పారు. సినిమాపై ఉన్న అభిరుచితోనే తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. వెంకటేష్-త్రివిక్రమ్ కలయికలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' గురించి శ్రీనిధి ప్రత్యేకంగా స్పందించారు. వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రంలో తనకు అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదని, ఈ ప్రాజెక్టులో భాగం కావడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.





## నా డ్రెస్‌పై ప్రైమ్‌టైమ్ డిబేటా
# నమ్మలేకపోయా!

### రక్షాబంధన్ యాడ్ వివాదంపై కృతి సనన్ ఆసక్తికర వ్యాఖ్యలు

**ముంబై, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** "నా దుస్తుల గురించి ఏకంగా ఆరుగురు వ్యక్తులు కూర్చొని చర్చించడం చూసి షాకయ్యా. అసలు అది జరుగుతోందంటేనే నమ్మలేకపోయా" అంటూ బాలీవుడ్ నటి కృతి సనన్ గతంలో తన రక్షాబంధన్ ప్రకటన చుట్టూ తలెత్తిన వివాదాన్ని గుర్తుచేసుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో మొదలైన విమర్శలు చివరకు టీవీ చానళ్లలో ప్రైమ్‌టైమ్ చర్చల వరకు వెళ్లడం తనను తీవ్రంగా ఆశ్చర్యపరిచిందని చెప్పారు.కరీనా కపూర్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న 'వాట్ విమెన్ వాంట్' ఆరో సీజన్‌లో పాల్గొన్న కృతి.. తనపై గతంలో వచ్చిన విమర్శల గురించి మాట్లాడారు. రక్షాబంధన్‌కు సంబంధించిన ఓ ప్రకటనలో తాను ధరించిన దుస్తులపై సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున విమర్శలు వచ్చాయని, వివాదం ముదరడంతో చివరకు సంబంధిత సంస్థ ఆ ప్రకటనను తొలగించిందని గుర్తుచేశారు. "నా డ్రెస్ అంత పెద్ద వివాదానికి కారణమవుతుందని అస్సలు అనుకోలేదు. సామాజిక మాధ్యమాల్లో విమర్శలు రావడం ఒక ఎత్తయితే.. టీవీలో ఆరుగురు సభ్యులతో ప్యానెల్ ఏర్పాటు చేసి నా దుస్తులపై చర్చించడం మరో ఎత్తు. అది చూసి నిజంగానే షాకయ్యా" అని కృతి వ్యాఖ్యానించారు. మహిళలు ఏం ధరించాలి? ఎలా కనిపించాలి? ఎలా ప్రవర్తించాలి? అనే విషయాల్లో ఇతరులు నిరంతరం తీర్పులు ఇవ్వడం మానుకోవాలని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం మహిళలు ప్రధానంగా కోరుకునేది ఏమిటన్న ప్రశ్నకు స్పందిస్తూ.. "ఇతరులను అనవసరంగా జడ్జ్ చేయడం ఆపేయండి. ఎవరి పని వారు చూసుకుంటే చాలు" అని పేర్కొన్నారు. మహిళల వస్త్రధారణకు హద్దులు నిర్ణయించడం, వారి వ్యక్తిగత ఎంపికలపై ఇతరులు తీర్పులు ఇవ్వడం వంటి ధోరణులు మారాల్సిన అవసరం ఉందన్న కృతి వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.



# మాధురి రాథోడ్ మళ్లీ జోరు..

### కొత్త ఫోక్ సాంగ్‌తో కమ్‌బ్యాక్



**హైదరాబాద్, అక్టోబరు 7 (ఉద్యమ కెరటం):** 'నిమ్మ తోట వనములో', 'సీటీ చీర', 'బాసింగ బలాలే' వంటి జానపద పాటలతో తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు తెచ్చుకున్న మాధురి రాథోడ్ మరోసారి వార్తల్లో నిలిచింది. హైదరాబాద్‌కు చెందిన ఆమె మోడల్‌గా, డిజిటల్ కంటెంట్ సృష్టికర్తగా, ముఖ్యంగా జానపద నృత్యకారిణిగా మంచి పేరు సంపాదించుకుంది. తాజాగా 'బిందెలు బిందెలు బావయ్యో' అనే కొత్త జానపద పాటతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 'బిందెలు బిందెలు బావయ్యో' పాటకు సంబంధించిన ప్రచార దృశ్యాలను తాజాగా విడుదల చేశారు. ఎప్పటిలాగే మాధురి రాథోడ్ తనదైన మాస్ ఎనర్జీతో స్టెప్పులు వేసి ఆకట్టుకుంది. పాట విడుదలైన కొద్ది గంటల్లోనే సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. యూట్యూబ్‌తో పాటు ఇతర వేదికల్లోనూ ఈ పాటకు మంచి స్పందన లభిస్తోంది. త్వరలోనే పూర్తి పాటను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఇటీవల మాధురి రాథోడ్, ఆమెతో కలిసి పనిచేసిన నృత్యకారుడు ఈశ్వర్ సాయి వ్యక్తిగత వ్యవహారం తీవ్ర చర్చకు దారితీసింది. ఈ ఘటనల నేపథ్యంలో ఇద్దరి కెరీర్ దెబ్బతింటుందని పలువురు భావించారు. అయితే ఈశ్వర్ సాయి కూడా ఇటీవల తన కొత్త పాటకు సంబంధించి విలేకరుల సమావేశం నిర్వహించి, వృత్తిపరంగా మళ్లీ బిజీ అవుతాననే ధీమా వ్యక్తం చేశాడు. తాజాగా మాధురి కూడా కొత్త పాటతో ప్రేక్షకుల ముందుకు రావడంతో ఇద్దరూ తమ కళారంగ కార్యకలాపాలను కొనసాగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈశ్వర్ సాయి, మాధురి రాథోడ్ జోడీకి జానపద పాటల్లో మంచి క్రేజ్ ఉంది. వీరిద్దరూ కలిసి నటించిన 'రాతిరి రాతిరి రాతిరిలో', 'సీటీ చీర', 'సన్న సన్న బియ్యమే', 'ప్రమీల ప్రమీల', 'కళ్లకు కాటుక దిద్దినారో', 'అది అబ్బబ్బాగా పోరి', 'లాయి లాయి లబ్బరు బొమ్మ', 'బాసింగా బలాలే' వంటి పాటలు యూట్యూబ్‌లో భారీగా వీక్షణలు సాధించాయి. దీంతో కొత్తగా వచ్చిన 'బిందెలు బిందెలు బావయ్యో' పాటపైనా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

# 'నా వైఫ్ మిస్సింగ్'.. అసలు ఆమెకు ఏమైంది?

### ఊహించని మలుపులతో ఉత్కంఠ రేపుతున్న టీజర్

**హైదరాబాద్, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం):** భార్య కనిపించడం లేదంటూ ఓ భర్త పోలీస్ స్టేషన్‌కు వెళ్తాడు.. కానీ ఆమె నిజంగానే అదృశ్యమైందా? ఇంటి నుంచి వెళ్లిపోయిందా? ఆమెకు ఏదైనా జరిగిందా? లేక ఈ కథ వెనుక భర్తకే తెలియని రహస్యం ఉందా?.. ఇలా వరుస ప్రశ్నలు రేకెత్తిస్తూ 'నా వైఫ్ మిస్సింగ్' టీజర్ ఆసక్తి పెంచుతోంది. వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్ ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న ఈ సస్పెన్స్ థ్రిల్లర్ అక్టోబర్ 22 నుంచి 'ఆహా'లో ప్రసారం కానుంది. 'కొత్త బంగారు లోకం'తో యువత మనసులు గెలుచుకున్న వరుణ్ సందేశ్-శ్వేతా బసు ప్రసాద్ జోడీ దాదాపు 18 ఏళ్ల తర్వాత మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. అయితే ఈసారి ప్రేమ కథతో కాకుండా సస్పెన్స్, మిస్టరీతో నిండిన వెబ్ సిరీస్‌తో అలరించేందుకు సిద్ధమైంది. 'నా వైఫ్ మిస్సింగ్'లో వరుణ్ సందేశ్ సాధారణ బ్యాంకు ఉద్యోగి 'బాలు' పాత్రలో కనిపించనుండగా, ఆయన భార్య పాత్రను శ్వేతా బసు ప్రసాద్ పోషిస్తున్నారు. తాజాగా విడుదలైన టీజర్‌లో పెళ్లి తర్వాత తన భార్య కనిపించడం లేదంటూ బాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం కథకు కీలక మలుపుగా కనిపిస్తోంది. అక్కడి నుంచే అసలు ఉత్కంఠ మొదలవుతుంది. ఆమెకు ఏమైంది? స్వచ్ఛందంగా వెళ్లిపోయిందా? ఏదైనా ప్రమాదం జరిగిందా? ఈ వ్యవహారంలో భర్త పాత్ర ఏంటి?.. అనే అనుమానాలను టీజర్ రేకెత్తిస్తోంది. ఊహించని మలుపులతో కథను నడిపించనున్నట్లు టీజర్ సంకేతాలిస్తోంది. 'అనుమానం.. అవమానం.. అవకాశం..' అనే ఆసక్తికరమైన ప్రచార వాక్యంతో వస్తున్న ఈ సిరీస్‌ను తెలుగు, తమిళ భాషల్లో అక్టోబర్ 22 నుంచి ప్రసారం చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: 9030717172, 9391127717

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

## ఎస్సై పల్లెల ప్రదీప్




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వేంసూర్ ఎస్సై పల్లెల ప్రదీప్ అన్నారు. వేంసూర్ మండల కేంద్రంలో స్థానిక ప్రజలు, వ్యాపారస్తులకు సైబర్ నేరాలు, ఇతర నేరాల నియంత్రణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వ్యాపారులు తమ దుకాణాల్లో తగిన భద్రత చర్యలు చేపట్టడంతో పాటు అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పద లావాదేవీల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. సైబర్ నేరగాళ్లు చేసే మోసపూరిత ఫోన్ కాల్స్, సందేశాలు, లింక్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు, పాస్వర్డ్లను ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు నేరాలకు సంబంధించిన సమాచారాన్ని సకాలంలో పోలీసులకు అందిస్తే సైబర్ నేరాలతో పాటు ఇతర నేరాలను కూడా నియంత్రించవచ్చని పేర్కొన్నారు.

# మహిళా సంఘాలకు ఆర్థిక చేయూత

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. రామ్మ్యాం' అమలులో భాగంగా ఎన్ఆర్ఎల్ఎం పథకం కింద బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదిలాబాద్ రూరల్ మండలం రాజర్షిషా గూడ గ్రామానికి చెందిన అర్హులైన మహిళ సంఘాల సభ్యులకు ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం అమలులో భాగంగా గొర్రెలు, మేకల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ఝాన్సీ లక్ష్మి, అంజలి మహిళా సంఘాలను గుర్తించి వారికి ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా ఒక్కో గ్రూపులో నలుగురు సభ్యుల చొప్పున గుర్తించి, వారికి రూ. 1లక్ష చొప్పున ఒక్కొక్కరికి రూ. 25వేల రుణం అందించామని తెలిపారు. ఈ ఆర్థిక సహాయంతో మహిళలు మేకల పెంపకం చేపట్టి, వాటిని సక్రమంగా పెంపకం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, ఏపిఎం అనిల్, డిపిఎం శోభ, సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# రైతన్నల సంక్షేమమే ధ్యేయం

- వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



**ఉద్యమ కెరటం, జుక్కల్:** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. జుక్కల్ నియోజకవర్గంలోని చిన్న కొడప్గల్, బిచ్కుంద టౌన్, షెట్లూర్, ఖాత్గావ్, కుర్లా, ఎంబుర, ఏలేగావ్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రేడ్-ఏ రకం వరి ధాన్యానికి ప్రభుత్వం క్వింటాలుకు రూ.2,461 కనీస మద్దతు ధరగా నిర్ణయించిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్దేశిత సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు అదనంగా రూ.500 బోనస్ అందిస్తామని పేర్కొన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, వైస్ ప్రెసిడెంట్ యునుస్ పటేల్, డోంగ్లీ మండల కాంగ్రెస్ నాయకుడు గజానన్ దేశాయ్, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు బాచావార్ లక్ష్మణ్ పటేల్, తహశీల్దార్ రంజిత్ కుమార్, ఏపీఎం జగదీష్, ఐకేపీ సిబ్బంది, రెవెన్యూ అసిస్టెంట్ సాయిబాబా, సర్పంచులు, ఉప సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# ఆయిల్పామ్ సాగుతో అధిక ఆదాయం

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** రైతులు సాంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించి అధిక ఆదాయం పొందాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు సూచించారు. కాగజ్నగర్ రూరల్ మండలం అరెగూడ గ్రామంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రైతు సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయిల్పామ్ సాగు చేస్తున్న 16 మంది రైతులను, కపాస్ క్రాంతి పథకం కింద అధిక సాంద్రతతో పత్తి సాగు చేస్తున్న ఐదుగురు రైతులను ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం ఆయిల్పామ్ గెలల కొనుగోళ్లను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు వరి, పత్తితో పాటు యాసంగిలో మొక్కజొన్న, జొన్న, పెసర, పుచ్చకాయలు, కూరగాయలు తదితర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. ఎల్నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటిపోయే అవకాశం ఉన్నందున నీటి వినియోగంలో రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ధాన్యం, మొక్కజొన్న, పత్తి పంటలకు మద్దతు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 1,750 ఎకరాల్లో ఆయిల్పామ్ సాగవుతోందని, ఈ ఏడాది మరో వెయ్యి ఎకరాల్లో సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. ఆయిల్పామ్ సాగులో నాలుగో సంవత్సరం నుంచి ఎకరానికి సుమారు రూ.లక్ష, ఎనిమిదో సంవత్సరం నుంచి సుమారు రూ.2 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. రైతులు ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ ఆయిల్పామ్ సాగుపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భీమంకర్ పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్ధల దేవయ్య, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, ఏడీఏ మనోహర్, ఏఓ రామకృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్త మధుబాబు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నదీమ్, సుప్రియ, ఎస్సై నరేష్, రైతులు పాల్గొన్నారు.

# యువతలో క్రీడా స్ఫూర్తికి ప్రోత్సాహం

- ఉజ్వలా బ్యాడ్మింటన్ అరేనా ప్రారంభం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని తమలోని ప్రతిభను వెలికితీయాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉజ్వలా బ్యాడ్మింటన్ అరేనాను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు యువతతో మమేకమై క్రీడల ప్రాధాన్యత, క్రీడా స్ఫూర్తి, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి వివరించారు. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. యువత క్రీడలను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. స్థానికంగా యువతకు మెరుగైన క్రీడా వసతులు అందుబాటులోకి రావడం ద్వారా ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. బ్యాడ్మింటన్ వంటి క్రీడలపై యువత ఆసక్తి పెంచుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# టీసీ ఇవ్వకుండా విద్యార్థిని వేధిస్తున్న ప్రైవేట్ కాలేజీ

- అదనపు ఫీజులు చెల్లించాలంటూ ఒత్తిడి.. అదనపు కలెక్టర్కు ఫిర్యాదు



**ఉద్యమ కెరటం, ఖమ్మం:** ఫీజులు చెల్లించినప్పటికీ ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్ (టీసీ), ఒరిజినల్ విద్యా ధ్రువపత్రాలు ఇవ్వకుండా అదనపు డబ్బులు డిమాండ్ చేస్తూ వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఓ విద్యార్థిని జిల్లా అధికారులను ఆశ్రయించింది. తనకు న్యాయం చేయాలని కోరుతూ ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ పిన్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఖమ్మం పట్టణానికి చెందిన దాసరి దీపిక ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. 2021లో ఖమ్మంలోని పులిపాటి ప్రసాద్ జీఎన్ఎం నర్సింగ్ కళాశాలలో చేరినట్లు తెలిపింది. మొదటి సంవత్సరం ఫీజును పూర్తిగా చెల్లించగా, ఆ తర్వాత కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో రెండో సంవత్సరం చదువును మధ్యలోనే నిలిపివేసినట్లు తెలిపింది. చదువు నిలిపివేసినప్పటికీ కళాశాల యాజమాన్యం తన పదో తరగతి, ఇంటర్మీడియట్ మెమోలు, టీసీ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. నాలుగో సెమిస్టర్ నుంచి ఐదో సెమిస్టర్ వరకు ఫీజుతో పాటు పెనాల్టీ కూడా చెల్లించాలని అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించింది. తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేక అదనపు ఫీజులు చెల్లించే స్థోమత లేదని, తన ఒరిజినల్ సర్టిఫికెట్లు, టీసీ ఇప్పించి న్యాయం చేయాలని అధికారులను కోరింది. ఈ విషయంపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. విద్యార్థినితో పాటు పడిశాల మధుసూదన్రావు, ఎస్.కె. మస్తాన్, ఖమ్మం ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి దుమాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య





**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపురావు, మండల విద్యాధికారి, గ్రామ సర్పంచ్ ఫయాజ్ లతో కలిసి సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులు, రిజిస్టర్లను తనిఖీ చేసి పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్ష తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేసే పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యే విధంగా బోధించాలని, ప్రతి విద్యార్థి విద్యా పురోగతిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక బోధన అందిస్తూ విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పరిశుభ్రత, సురక్షిత తాగునీటిపై అవగాహన కల్పించాలి

## రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడంతో పాటు నీటి వనరుల పరిరక్షణ, పరిశుభ్రతపై విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద సూచించారు. బుధవారం భీమారం మండలం దాంపూర్ గ్రామంలో బాలవికాస నీటి శుద్ధీకరణ పథకాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.3.25 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ నీటి శుద్ధీకరణ కేంద్రం ద్వారా రూ.5కే 20 లీటర్ల శుద్ధమైన తాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. నీటిని పొదుపుగా వినియోగించడం, తాగునీటి వనరులను పరిశుభ్రంగా ఉంచడం, కాలుష్యాన్ని నివారించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించి స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమంలో భాగంగా దాంపూర్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 72 ఇళ్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా అర్హులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డుదారులకు ఒక్కొక్కరికి 6 కిలోల సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నామని, పరిమితి దాటిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వివరించారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 10వేల మంది ఉపాధ్యాయుల నియామకం చేపట్టి నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలోని సోమనపల్లిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రజల సౌకర్యార్థం వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేశామని, త్వరలో ప్రారంభించి వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. గ్రామంలో పల్లె దవాఖానకు శంకుస్థాపన చేశామని, రూ.4 కోట్లతో సీసీ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బతుకమ్మ వేడుకల కోసం హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు బోర్లు వేసి తాగునీటిని అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ(బోథ్):** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని కోరుతూ బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు బుధవారం బోథ్ రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం అందజేశారు. దేశ వ్యాప్తంగా కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పై, ఎస్ఐఆర్ పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గ ఎస్ఐఆర్ సమన్వయకర్త పసుల చంటి మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న నోటీసులను తక్షణమే అందించాలని, 18 సంవత్సరాలు నిండిన వారికి నూతన ఓటు హక్కు కల్పించడం కోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఓటరు తొలగింపు ప్రక్రియలో ఫారం-7 ద్వారా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బిఎల్ఎల సమక్షంలో చనిపోయిన వారి ఓట్లు మాత్రమే తొలగించాలని, మ్యాపింగ్ కానీ, అందుబాటులో లేని ఓటర్లకు అన్ని పార్టీల బిఎల్ఎల సహాయంతో గడపగడపకు తిరిగి నోటీసులు అందించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా, అప్రజాస్వామికంగా తీసుకువచ్చిన నూతన ఎన్నికల సంస్కరణలను రద్దు చేయాలని, ఎస్ఐఆర్ ద్వారా తొలగించిన 13 కోట్ల ఓటర్లను తిరిగి జాబితాలో చేర్చాలని, ఫారం నెంబర్ 6 పాత పద్ధతిలోనే తీసుకోవాలని డిమాండ్ చేశారు. జ్ఞానేష్ కుమార్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని, సుప్రీంకోర్టు ద్వారా విచారణ ఎదుర్కోవాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు భోజన్న, తలమడుగు మండల అధ్యక్షుడు కస్తాల ప్రతాప్, సీనియర్ నాయకులు వార్డ్ మెంబర్ షేక్ షాకిర్ తదితరులు పాల్గొన్నారు.

# దళితులను భయభ్రాంతులకు గురిచేస్తే ఊరుకోం



**ఉద్యమ కెరటం, తాండూర్:** దళితులను భయభ్రాంతులకు గురిచేస్తే సహించేది లేదని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా అండగా నిలుస్తామని పేర్కొన్నారు. బుధవారం మాదారం సర్పంచ్ కృష్ణపల్లి లక్ష్మణ్, ఆయన భార్య, అంగన్వాడీ టీచర్ మీనాను పరామర్శించారు. గత సోమవారం అంగన్వాడీ టీచర్ మీనాపై ఐసీడీఎస్ పీడీ రవూఫ్ఖాన్ దర్యాప్తు పేరుతో ఒత్తిడి, భయాందోళనలకు గురి చేయడాన్ని ఖండించారు. దీనిపై సంబంధిత అధికారి వివరణ అందుబాటులో లేదని తెలిపారు. ఫిర్యాదు ఆధారంగా సమగ్ర విచారణ నిర్వహించకుండా సర్పంచ్, ఆయన భార్యపై నిరాధార ఆరోపణలు చేస్తూ ఇబ్బందులకు గురిచేయడం సరికాదని అన్నారు. అంగన్వాడీ కేంద్రం నిర్వహిస్తున్న భవనం, అద్దెకు సంబంధించిన అంశాలు, కేంద్రంలోని లబ్ధిదారుల పరిస్థితులు, సిబ్బంది విధులకు హాజరవుతున్న తీరుపై సమగ్రంగా విచారణ జరిపారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారి తన విధులను నిస్పక్షపాతంగా నిర్వహించాలని, వ్యక్తిగత ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరించకూడదని పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాఖాపరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని తెలిపారు. ఈఐసీడీఎస్ పీడీపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, తప్పిదాలు నిర్ధారణ అయితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను పరిష్కరించకపోతే కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు, మండల ఇన్చార్జి జిలకర శంకర్, కాసిపేట కృష్ణ, ఆయిల్ల గణేష్, మాదారం పట్టణ అధ్యక్షుడు సముద్రాల ఆనంద్, తరంగ్ అశోక్, రాము, ఆసంపల్లి శ్రీనివాస్, ఏ.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అందరి సమన్వయంతో ప్రజా అభివృద్ధికి కృషి

- **రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలి**
- **రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద**





**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలందరూ రాజకీయాలకు అతీతంగా సహకరించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామంలో నిర్మించనున్న 33 కేవీ విద్యుత్ సబ్స్టేషన్కు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ సదుపాయాల విస్తరణ, రహదారుల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తదితర కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సబ్స్టేషన్ ఏర్పాటుకు భూమి కేటాయింపు విషయంలో కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో గ్రామ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అందరి సహకారంతో సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి సబ్స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో 32 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించని లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వ సహకారంతో నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామానికి 38 సామాజిక భద్రత పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 10వేల మంది ఉపాధ్యాయులను నియమించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో సుమారు రూ.100 కోట్లతో సీబీఎస్ఈ, రెసిడెన్షియల్ విద్యా సదుపాయాలతో 2,500 మంది విద్యార్థులకు వసతి కల్పించే ప్రత్యేక పాఠశాల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా అర్హులకు రూ.10లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామని, అవసరమైన సందర్భాల్లో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు.

### రహదారులు, మౌళిక వసతులకు ప్రాధాన్యం..

ఎమ్మెల్యే కాలనీ నుంచి ఆర్కే-5 వరకు 4.7 కిలో మీటర్ల రహదారి నిర్మాణానికి రూ.4.85 కోట్ల నిధులు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. గ్రామంలోని అవసరమైన ప్రాంతాల్లో దశలవారీగా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, జర్మన్ భాషలో ఇప్పటికే సుమారు 70 మంది యువతకు శిక్షణ కొనసాగుతోందని తెలిపారు. శిక్షణ పూర్తయిన వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నస్పూర్ మండల కేంద్రంలో జరిగిన రహదారి ప్రమాదంలో వెంకటాపూర్ గ్రామస్థులు మృతి చెందడంతో మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు రెండు నిమిషాలు మౌనం పాటించి మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. అనంతరం మందమర్రి మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో యూఐడీఎఫ్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 24 వార్డులకు సంబంధించి సుమారు రూ.15 కోట్ల నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలో మరో రూ.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయని చెప్పారు. అమృత్ పథకం ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్లు, సీసీ మురుగు కాలువల నిర్మాణంతో పట్టణంలో తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలను మెరుగుపరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ బానోత్ రాజన్న, మండల తహశీల్దార్ సతీష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మద్నూర్లో వరుస ఇళ్ల చోరీ కేసుల ఛేదన

- **ఇద్దరు నిందితుల అరెస్ట్**
- **10 తులాల బంగారం, 50 తులాల వెండి, నగదు, మొబైల్ స్వాధీనం**




**ఉద్యమ కెరటం, మద్నూర్:** మద్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే రాత్రి జరిగిన వరుస ఇళ్ల చోరీ కేసులను ఛేదించినట్లు బిచ్కుంద సీఐ రవికుమార్ తెలిపారు. సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన 10 తులాల బంగారం, 50 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.1,100 నగదు, మొబైల్ఫోన్ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గతనెల 4న రాత్రి మద్నూర్లోని ఒక ఇంటితో పాటు మేనూర్ గ్రామంలోని మూడు ఇళ్లలో దుండగులు చొరబడి బంగారం, వెండి, నగదు అపహరించారు. దీనిపై మద్నూర్ పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు బాన్సువాడ డీఎస్పీ పి.విఠల్రెడ్డి పర్యవేక్షణలో సీఐ, ఎస్సై మోహన్రెడ్డి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. దర్యాప్తులో సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన పోలీసులు చోరీలకు పాల్పడిన వారిని గుర్తించారు. ఈ క్రమంలో మరోసారి చోరీ చేసేందుకు మద్నూర్ వైపు వస్తున్న గుండెవర్ కరణ్, శివ ఎల్లప్పలను బుధవారం మద్నూర్ శివారులోని మిర్జాపూర్ హనుమాన్ ఆలయం వద్ద అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1,100 నగదు, ఒక మొబైల్ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా, గతంలో చోరీ చేసిన బంగారం, వెండి ఆభరణాలను మహారాష్ట్రకు చెందిన మంగేష్, నౌషాద్, రైస్ అనే వ్యక్తులకు విక్రయించినట్లు విచారణలో వెల్లడైంది. నిందితులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఆయా వ్యక్తుల వద్ద నుంచి చోరీకి గురైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసుల ఛేదనలో మద్నూర్ ఎస్సై మోహన్రెడ్డి, కానిస్టేబుళ్లు విఠల్, విష్ణు, సీసీఎస్ కానిస్టేబుళ్లు గణపతి, రాజేందర్, శ్రీనివాస్, లక్ష్మీకాంత్, రవి కీలకంగా వ్యవహరించారు. సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంలో సమర్థవంతంగా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# బోరిగాం పాఠశాలలో విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ప్రభుత్వం అందజేస్తున్న టై, బెల్టులను బుధవారం మండలంలోని బోరిగాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాథోడ్ వినీష్ పాల్గొని విద్యార్థులకు టై, బెల్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో పాటు విద్యపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు గ్రామస్తులు ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, గ్రామ యువకులు రాజేష్, నరేష్, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రంలో అక్షరభ్యాసం



**ఉద్యమ కెరటం, తాండూర్:** పోషణ మాసం సందర్భంగా తాండూర్ సెక్టార్ లోని అచలాపూర్-1 అంగన్వాడి కేంద్రంలో బుధవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అచలాపూర్ గ్రామ సర్పంచ్ ఎం. స్రవంతి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అలాగే పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. ఆకుకూరలు, కూరగాయలు తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ పిల్లలందరి బరువులు చూసి ఆరోగ్య స్థితి గురించి తల్లులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గట్టు సంతోష్ కుమార్, వార్డు సభ్యులు పోషయ్య, దాగం పాపయ్య, కొంచెం కళావతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వరూప రాణి, ఆశా కార్యకర్తలు, నర్సు మంజుల అంగన్వాడి టీచర్స్ మల్లు బాయి, అర్చన, అమృత, సునీత, కౌసల్య, గోపమ్మ, రమ్య,హెల్పర్స్, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# కోనేరు కోనప్ప జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కాగజ్నగర్ పట్టణంలో బుధవారం కోనేరు అభిమానుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ కార్మికులకు నిత్యావసర సరుకులు, కూరగాయలను పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని ఎల్లాగౌడ్ తోట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన నాయకులు, కార్యకర్తలు అక్కడ చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోనేరు కోనప్ప ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించి ప్రజలకు మరింత సేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కోనేరు అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జైనూర్ సర్పంచ్ తల్లి మృతి పట్ల సుగుణ సంతాపం



**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ మండల కేంద్రంలోని కాశీప టేల్గూడ కు చెందిన జైనూర్ సర్పంచ్ కొడప ప్రకాష్ తల్లి కొడప మాన్కుబాయి అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె మృతి పట్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి కొడప ప్రకాష్ నివాసానికి వెళ్లి మాన్కుబాయి పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాన్కుబాయి మృతి కుటుంబానికి తీరని లోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మాన్కుబాయి పార్థివదేహానికి నివాళులర్పించారు.

# ప్రమాదకరంగా మారిన వంతెన

**రోడ్డుపై కోతలు.. ప్రయాణికుల వెతలు**



**ఉద్యమ కెరటం, సిర్పూర్(యు):** మండలంలోని శెట్టిహడ్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని చప్రి గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు అధ్వానంగా మారింది. మార్గమధ్యలోని చిన్న కాలువల వద్ద పైపులు వేసి నిర్మించిన వంతెన ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. వంతెన వద్ద మట్టి కొట్టుకుపోయి పెద్ద గుంత ఏర్పడటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ ఇదే మార్గం ద్వారా నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చప్రి గ్రామానికి రాకపోకలకు ఇదొక్కటే ప్రధాన మార్గం కావడంతో అధికారులు వెంటనే స్పందించి వంతెన వద్ద ఏర్పడిన గుంతను పూడ్చి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యపై దృష్టి సారించకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# బోథ్ కాంగ్రెస్ ఇంచార్జి ఆడే గజేందర్ పరామర్శ

**రోడ్డు ప్రమాదంలో మరణించిన ఈఈ శివరామ్ సోదరుడికి నివాళి**



**ఉద్యమ కెరటం, బేల:** జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) శివరామ్ సోదరుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందారు. బుధవారం బేల మండలంలోని పిడ్గాం గ్రామంలో నిర్వహించిన దినకర్మ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. అకాల మరణం చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ తీరని లోటును తట్టుకునే శక్తిని, మనోధైర్యాన్ని భగవంతుడు ఆ కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సతీష్ నాయక్, ప్రవీణ్ రెడ్డి, గంగాధర్, ఎండీ సద్దాం తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా పండ్ల పంపిణీ



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** సిర్పూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పుట్టినరోజు వేడుకలను బెజ్జూర్ మండల బీఆర్ఎస్ నాయకులు సేవా కార్యక్రమాలతో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కోనేరు కోనప్ప ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

**సిబ్బంది, వాహన డ్రైవర్లతో మున్సిపల్ చైర్పర్సన్ సమావేశం**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. ఫిల్టర్బెడ్ వద్ద పారిశుద్ధ్య సిబ్బంది, ట్రాక్టర్, టాటా ఏస్ వాహనాల డ్రైవర్లు, శానిటేషన్ జవాన్లు, ఎస్ఐలతో బుధవారం సమావేశం నిర్వహించారు. పట్టణంలో పెరుగుతున్న జనాభా, విస్తీర్ణానికి అనుగుణంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పట్టణంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా వాహన డ్రైవర్లు తమకు కేటాయించిన ప్రాంతాల్లోని చెత్తను పూర్తిగా తరలించాలని ఆదేశించారు. ప్రతిఒక్కరూ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విధులను తప్పనిసరిగా నిర్వహిస్తూ, తమకు కేటాయించిన ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విధుల నిర్వహణలో ఇబ్బందులు ఎదురైతే శానిటేషన్ జవాన్లు, ఎస్ఐల ద్వారా, లేనియెడల నేరుగా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు పారిశుద్ధ్య సిబ్బంది, వాహన డ్రైవర్లు, జవాన్లు, ఎస్ఐలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి స్వచ్ఛమైన పట్టణంగా ఆదిలాబాద్ను తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో శానిటేషన్ ఎస్ఐ శంకర్, జవాన్లు, శానిటేషన్ సిబ్బంది, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- **8–12 శాతం లోపు తేమతో పత్తిని తీసుకురావాలి: కలెక్టర్ దివాకర టీఎస్**



**ఉద్యమ కెరటం, ఖమ్మం:** 2026–27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా కనీస మద్దతు ధరకు పత్తి విక్రయించాలనుకునే రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోళ్ల కోసం 8 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేసినట్లు తెలిపారు. ఖమ్మం, మద్దులపల్లి, మధిర, వైరా ప్రాంతాల్లోని కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రైతులు తమకు కేటాయించిన కొనుగోలు కేంద్రం వివరాలను ముందుగానే తెలుసుకుని అక్కడే పత్తిని విక్రయించాలని సూచించారు. పత్తిలో తేమ శాతం నాణ్యతతో పాటు ధరపై ప్రభావం చూపుతుందని తెలిపారు. జిల్లాలోని 129 రైతు వేదికల్లో మాయిశ్చర్ మీటర్ల ద్వారా పత్తిలో తేమ శాతాన్ని పరీక్షించుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. రైతులు పత్తిని సాధ్యమైనంత వరకు ఆరబెట్టి 8–12 శాతం లోపు తేమతో కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. 8 శాతానికి మించి తేమ ఉంటే ప్రతి అదనపు ఒక్క శాతం తేమకు రూ.86.67 చొప్పున ధరలో తగ్గింపు ఉంటుందని అధికారులు తెలిపారు. సీసీఐ ద్వారా కనీస మద్దతు ధరకు పత్తి విక్రయించాలనుకునే కౌలు రైతులు ముందుగానే తాత్కాలిక రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. సమీప వ్యవసాయ విస్తరణ అధికారి, మండల వ్యవసాయ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రైతులు 'కపాస్ కిసాన్' మొబైల్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవాలని, మొబైల్ నంబర్, ఓటీపీతో యాప్లో లాగిన్ అయి స్లాట్ బుక్ చేసుకోవచ్చన్నారు. కొనుగోలు కేంద్రాల వివరాలు, పత్తి విక్రయాలు, తక్పట్టి, చెల్లింపుల వివరాలను కూడా యాప్ ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. సందేహాల నివృత్తికి వాట్సాప్ హెల్ప్లైన్ 8897281111, 'కపాస్ కిసాన్' యాప్ టోల్ఫ్రీ నంబర్ 18005995779ను సంప్రదించాలని సూచించారు. పత్తి కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరిగేలా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# ఏజెన్సీ దళితుల భూ సమస్యలు పరిష్కరించాలి

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఏజెన్సీ ప్రాంతాల్లో దళిత సాగుదారులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక భూ సమస్యలను పరిష్కరించి, వారు సాగు చేసుకుంటున్న భూములకు పహాణీలు మంజూరు చేసి శాశ్వత హక్కులు కల్పించాలని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ కే.పరమేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్లోని క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో దళిత కుటుంబాలు తరతరాలుగా భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. భూములకు పహాణీలు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు రుణ సదుపాయాలను పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత కుటుంబాలకు భూ హక్కులు కల్పించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక భద్రతకు భరోసా కలుగుతుందని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. వినతిపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సానుకూలంగా స్పందిస్తూ ఏజెన్సీ దళితుల భూ సమస్య అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, దళితులకు న్యాయం జరిగేలా, భూ హక్కులు కల్పించే దిశగా ప్రభుత్వ పరంగా తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త జాడే నాగోరావు, డీసీసీ ఉపాధ్యక్షుడు బ్రిజలాల్ కర్మన్కర్, ఆదిలాబాద్ జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షులు బిరుదుల లాజర్, ఇథాడే విఠల్ తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడీ కేంద్రాలను ప్రీ-స్కూళ్లుగా తీర్చిదిద్దాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో పోషణ మాసం వేడుకలను పకడ్బందీగా నిర్వహించడంతో పాటు అంగన్వాడీ కేంద్రాలను ప్రీ-స్కూళ్లుగా తీర్చిదిద్ది పిల్లల ప్రాథమిక విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ మాసం, అంతర్జాతీయ బాలికల దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తొలి వెయ్యి రోజుల్లో పిల్లల మానసిక వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం అందించిన పుస్తకాలు, డిజిటల్ సాధనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్వాడీలకు అందే సరుకుల్లో నాణ్యత చాలా ముఖ్యమని, కోడిగుడ్లు తప్పనిసరిగా 45 నుంచి 50 గ్రాముల బరువు ఉండాలని, తక్కువ బరువున్నవాటిని తక్షణమే తిరస్కరించి వెనక్కి పంపాలని స్పష్టం చేశారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీ ప్రక్రియను రిజర్వేషన్ నిబంధనల ప్రకారం పారదర్శకంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సిడిపిఓలకు పోషణ చాంపియన్ అవార్డ్స్ ను, విద్యార్థులకు న్యూట్రిషన్ కిట్ లను అందజేశారు. అనంతరం అనీమియా నియంత్రణ పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించి, అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని బాల్య వివాహాల నిర్మూలనకు అతిథులు సంతకాలను చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, డిఎంహెచ్ఓ సాధన, శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, డిఈఓ మాధవి, ఇతర అధికారులు, సీడీపీవోలు, అంగన్వాడిలు, తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టుపై కాంగ్రెస్ నిరసన

- **అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం.. రోడ్డుపై బైఠాయించి ఆందోళన**

**ఉద్యమ కెరటం, కామారెడ్డి:** ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు పలువురు ఇండియా కూటమి ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేసి, అనంతరం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఢిల్లీలో జరిగిన పోలీసుల చర్యను నాయకులు ఖండించారు. ప్రజాస్వామ్య హక్కులు, ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, మండల అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మరోసారి కార్మిక లోకం అండగా నిలవాలి

- **ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే ధ్యేయం**
- **మాజీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీడీ చారి**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రాబోయే టీజీఎస్ఆర్టీసీ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో కార్మిక సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా తమ కూటమి పనిచేస్తుందని ఆర్టీసీ మాజీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీడీ చారి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మేనిఫెస్టోలోని 10 ముఖ్య హామీలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడిన అనుభవం తమకు ఉందన్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీని పూర్తి విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వైద్య, సంక్షేమ సౌకర్యాలు కల్పించడం, 2025 వేతన సవరణ అమలు, 2017, 2021 వేతన సవరణ బకాయిల చెల్లింపు, 2014 నుంచి పెండింగ్లో ఉన్న 12 ఏళ్ల లీవ్ ఎన్క్యాష్మెంట్ను విడుదల చేయడం తమ ప్రధాన డిమాండ్లలో ఉన్నాయని తెలిపారు. డ్రైవర్లు, కండక్టర్లకు రోజుకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయడం, చిన్న కారణాలతో సస్పెన్షన్లకు స్వస్తి పలికి ఉద్యోగ భద్రత కల్పించడం, మహిళా కార్మికులకు ప్రత్యేక రక్షణ, విశ్రాంతి గదులు, మౌలిక వసతులు కల్పించడం, సాంకేతిక కారణాలతో హయ్యర్ పెన్షన్ కోల్పోయిన 8 వేల మందికి పైగా కార్మికులకు న్యాయం చేయడం వంటి హామీలను మేనిఫెస్టోలో పొందుపరిచినట్లు చెప్పారు. సంస్థలో ఖాళీగా ఉన్న సుమారు 12వేల పోస్టులను భర్తీ చేయడంతో పాటు గ్యారేజ్ కార్మికులకు పెండింగ్లో ఉన్న ప్రమోషన్లు కల్పించడం, ప్రైవేట్ పద్ధతికి బదులుగా ఆర్టీసీ సంస్థే నేరుగా విద్యుత్ బస్సులను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవడం కూడా తమ మేనిఫెస్టోలోని ముఖ్య అంశాలని వివరించారు. తాను పదవిలో ఉన్నా.. లేకున్నా కార్మికుల పక్షాన నిలిచిన చరిత్ర ఉందన్నారు. మేనిఫెస్టోలోని హామీలను కాగితాలకే పరిమితం చేయకుండా సాధించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఈనెల 9న జరిగే యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో కార్మికులు తమ ప్యానెల్కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగేల నర్సింగ్, ఎస్ డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎంబి. రావు, డిపో కార్యదర్శులు ఆశన్న, డి.రమేష్, జాయింట్ సెక్రటరీ రమేష్, కార్యవర్గ సభ్యులు శంకర్, డిపో అధ్యక్షుడు నజీర్, కార్యవర్గ సభ్యులు ఎస్బీ రావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు మార్గదర్శి కేశవ పిళ్ళై

## నేడు పట్టు కేశవ పిళ్ళై జయంతి

దీవాన్ బహదూర్ పట్టు కేశవ పిళ్ళై (అక్టోబరు 8, 1860 – మార్చి 28, 1933) భారతీయ పాత్రికేయుడు, రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు. పట్టు కేశవపిళ్లే తమిళనాడు లోని ఉత్తర ఆర్కాటు జిల్లాలో వేంకటా చలం, సుబ్బమ్మ దంపతులకు 1860, అక్టోబరు 8వ తేదీన జన్మించాడు. మద్రాసులో ఆయన విద్యాభ్యాసం జరిగింది. ఆయన హిందూ పత్రికలో విలేఖరిగా తన వృత్తిని ఆరంభించాడు. అనంతపురం జిల్లా, గుత్తిలో కరెస్పాండెంటుగా ఆయన 1883లో తన 22వ యేట నియమించ బడ్డాడు. గుత్తిలో స్థిరపడటం వలన పట్టు కేశవ పిళ్లెను ప్రజలు "గుత్తి కేశవపిళ్లై"గా పిలువ సాగారు. 1893, అక్టోబర్ 4వ తేదీన బ్రిటిష్ సైనికుల అత్యాచారం నుండి యిద్దరు హిందూ మహిళలను రక్షించే క్రమంలో, గుత్తిలోని రైలుగేటు కీపర్ గూళిపాలెం హంపన్న ప్రాణాలొడ్డాడు. ఈ సంఘటనలో బ్రిటిష్ సైనికులు హంపన్నను కాల్చి చంపారు. ఆ సంఘటన గురించి గుత్తి కేశవపిళ్లే హిందూ పత్రికకు వార్త పంపగా అది ప్రముఖంగా ప్రచురింప బడింది. ఆ వృత్తాంత మంతా హిందూ పత్రికలో రావడంతో ఇంగ్లీషు వారు ఆంగ్లేయులకు ఏర్పరిచిన ప్రత్యేకమైన ప్రతిపత్తులతో కూడిన కోర్టులో విచారణ జరిపించారు. అప్పట్లో కేశవపిళ్లే గుత్తిలో సెకెండ్ గ్రేడ్ ప్లీడర్‌గా ప్రాక్టీసు చేసేవాడు. ఈ సంఘటన గురించి బ్రిటిష్ సైనికులకు వ్యతిరేకంగా వాదించాడు. అక్కడ ఉన్న జ్యూరీ వారిలో అధికభాగం ఆంగ్లేయులు, మిగిలిన కొందరు వారిపై జీవనము ఆధారపడిన దుబాసీలు. కోర్టులో ఆ స్త్రీలు వ్యభిచారులని, హంపన్న వ్యభిచరింప జేసే వ్యాపారియని వ్యభిచారం విషయంలో డబ్బు ఎక్కువ తక్కువల్లో తమను కొట్టవచ్చాడని, ఆత్మరక్షణార్థం తాము కాల్చామని వాదించారు. వాదనలు నడుస్తూండగానే ఈ కేసుకు వ్యతిరేకంగా హిందూ పత్రికలో చాలా వార్తలు, అభిప్రాయాలు వచ్చాయి. చివరకు ఈ కేసులో వ్యభిచార వ్యవహారంలో తేడా రావడంతోనే ఈ ఘటన జరిగిందని, హంపన్న అమాయకుడేమీ కాదన్న వ్యాఖ్యలు చేస్తూ ఈ నేపథ్యంలో ఆంగ్ల సైనికుల దోషం ఏమీ లేదని తేల్చి, నిర్దోషులుగా విడిచి పెట్టాయి. ఇది జాత్యహంకారానికి ఉదాహరణ అంటూ హిందూ దినపత్రిక తీవ్రంగా ఖండించింది. స్థానికులు వీరుడైన హంపన్నపై ఇటువంటి ఘోరారోపణ చేయడాన్ని సహించలేక ఓ స్మారక చిహ్నం నిర్మించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. దీనికి హిందూ పత్రిక సహకరించి, తమ పత్రిక ద్వారా విరాళాల కోసం ప్రయత్నాలు సాగించింది. గ్రామస్థులు, హిందూ పత్రికవారూ విరాళాలిచ్చిన దాతల సహకారంతో హంపన్న స్మారక చిహ్నాన్ని నిర్మించారు. స్మారక సంఘం వారు స్మారక చిహ్నం నిర్మాణానికి తొమ్మిది చదరపు టడుగుల స్థలాన్ని కొనుగోలు చేసి, దానిపై ఏడడుగుల ఎత్తుగల రాతిస్తంభం నిలబెట్టి, దానికి ఓ స్మారక ఫలకాన్ని వ్రాయించి పెట్టారు. చుట్టూ ఆవరణ గోడ కూడా కట్టించారు. ఆ శిలాఫలకంపై ఆంగ్లంలో ఈ క్రింది విధంగా చెక్కారు. "Here lie the remains of Goolapalien Hampanna, the Gate keeper, who while defending two Hindu women against a party of European soldiers near the Guntakkal rest camp was shot by one of them on October 4, 1893. He died here on October 5. Raised by European and Indian admirers" స్మారకచిహ్నం ఏర్పాటు, తమకు అవమాన కరమని కొందరు బ్రిటీష్ అధికారులకు తోచి, స్థల విక్రయం రద్దుచేయాలని ప్రయత్నించారు. కాని వ్రాయించిన దస్తావేజు విస్పష్టముగా నుండడం, దానిలో కూడా స్థలం కొనుగోలు స్మారక చిహ్నం నెలకొల్పేందుకే నన్న సంగతి వ్రాసి వుండడం కారణాలతో ఏమీ చేయలేక పోయారు. డిప్యూటీ పోలీస్ ఇన్స్పెక్టర్ జనరల్ సూపరింటెండెంట్ అయిన లెగ్గట్ ఈ స్మారక చిహ్నాన్ని చూసి చాలా ఆగ్రహించారు. దీనిని ఎలాగైనా తొలగించాలని సిఫారసు చేస్తూ చెన్నపట్టణ ప్రభుత్వం వారికి వ్రాశారు. గుత్తి విలేఖరి యైన కేశవపిళ్లైపై రాజద్రోహ నేరం కింద కేసు నమోదు చేయాలని ప్రయత్నాలు చేశారు. ఐతే ఇవేవీ జరగలేదు. మద్రాసు గవర్నర్ వెన్లక్ ప్రభుత్వం హంపన్న స్మారక చిహ్నం ఏమీ చేయరాదన్న ఉత్తర్వు చేసింది. ఈ సంఘటనతో హంపన్నతో పాటుగా గుత్తి కేశవపిళ్లే కూడా ప్రజల మనసుల్లో స్థానం సంపాదించాడు. హంపన్న వృత్తాంతంతో ఆయనను స్థానిక ప్రభుత్వం గుర్తించి అనంతపురం, కర్నూలు, బళ్ళారి జిల్లాలకు జిల్లా బోర్డు సభ్యుడిని చేసింది. 1916–17లో ఇతడు కాంగ్రెస్ సభ్యునిగా చురుగ్గా పని చేశాడు. మద్రాసు శాసన మండలి సభ్యునిగా ఎన్నుకో బడ్డాడు. ఆయన గుత్తి తాలూకా బోర్డు ఉపాధ్యక్షుడిగా కూడా పని చేశాడు. మద్రాసు ఫారెస్ట్ సభ్యుడిగా సేవలను అందించాడు. శ్రీలంకలోని భారతీయ వర్తకుల కోరిక మేరకు అక్కడికి వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించి ఒక నివేదికను సమర్పించాడు. 1885లో బొంబాయిలో జరిగిన స్వాతంత్ర్యోద్యమ ప్రథమ మహాసభకు అయన హాజరయ్యాడు. కేశవ పిళ్ళై గుత్తి నగరపాలికకు ఎన్నికై, నగర పాలిక సభ్యుడుగా పనిచేశాడు. చివరకు ఆయన నగర పాలికలకు ప్రాతినిధ్యం వహించడానికి మద్రాసు శాసన మండలికి ఎన్నికయ్యాడు. కేశవ పిళ్ళై తన తొలినాటి నుండి రాజకీయాల్లో ఆసక్తి చూపాడు. 1885, డిసెంబరు 28న బొంబాయిలో జరిగిన తొలి భారత జాతీయ కాంగ్రేసు సమావేశంలో, గుత్తి పట్టణ ప్రతినిధిగా పాల్గొన్నాడు. ఆ తర్వాత మరింత తీవ్రవాద పద్ధతులను అవలంబించి కొన్నిసార్లు జైలుకు కూడా వెళ్ళాడు. ఆయన జస్టిస్ పార్టీని, ద్రవిడ ఉద్యమాన్ని గట్టిగా వ్యతిరేకించాడు. కేశవ పిళ్ళై మద్రాసు శాసన మండలిలో చాలాకాలం పాటు పనిచేశాడు. సభలో అనేక సంస్కరణా ప్రతిపాదనలను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకు దక్కుతుంది. పానగల్ రాజా ప్రభుత్వం ఆమోదించిన జైలు మార్గదర్శకాలు, జైలు కమిషన్ యొక్క ప్రధాన రచయిత పిళ్ళై. మద్రాసు అటవీ కమిషన్ సృష్టికర్త కూడా ఆయనే. ఆ తర్వాత కేశవ పిళ్ళై శాసనమండలి ఉపాధ్యక్షుడిగా కూడా ఎన్నికై, ఆ హోదాలో కొంతకాలం పని చేశాడు. ఆయన సేవా దృక్పథాన్ని గుర్తించి అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం రావు బహద్దూర్ బిరుదుతో సత్కరించింది.

# ప్రపంచంలోనే 4వ పెద్దది ఐఏఎఫ్

## నేడు భారత వైమానిక దళ దినోత్సవం



భారత వైమానిక దళ దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ 8న నిర్వహించ బడుతుంది. భారతీయ వైమానిక దళం (ఇండియన్ ఎయిర్ ఫోర్స్) 1932, అక్టోబరు 8వ తేదీన స్థాపించబడి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద వైమానిక దళంగా పేరు పొందింది. అంతటి శక్తివంతమైన వైమానిక దళం సేవలను గుర్తిస్తూ ప్రతిఏటా అక్టోబర్ 8న భారత వైమానిక దళ దినోత్సవం నిర్వహించడం జరుగుతుంది. 1932, అక్టోబర్ 8న ఏర్పడిన భారత వైమానిక దళం బ్రిటీష్ తరపున రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నది. దానికి గుర్తుగా 1945లో రాయల్ భారత వైమానిక దళంగా మార్చబడింది. 1950లో గణతంత్ర దేశంగా ఆవిర్భవించిన తరువాత భారత వైమానిక దళంగా రూపాంతరం చెందింది. 1933 ఏప్రిల్ 1న భారత వైమానిక దళానికి తొలి ఎయిర్‌క్రాఫ్ట్ వచ్చింది. తొలినాళ్ళలో కేవలం ఐదు మంది పైలట్స్, ఒక ఆర్ఏఎఫ్ మాత్రమే ఉండేవారు. మొత్తం ఐదు ఆపరేషనల్ కమాండింగ్ కేంద్రాలను కలిగిన ఐఏఎఫ్‌కు 1,130 కంబోట్ 1,700 నాన్ కంబోట్ ఎయిర్‌కాఫ్టలు ఉన్నాయి. ప్రపంచం లోనే నాలుగో అతిపెద్ద వాయు సేనగా భారత వైమానిక దళం పేరు గడించింది. తనకు అవసరమైన సిబ్బందికి అధునాతన శిక్షణ ఇచ్చుకోవడం లోను, అధునాతన యంత్ర సామాగ్రిని సమకూర్చు కోవడం లోను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ముందంజలో ఉండటమే కాకుండా.. ప్రపంచ దేశాలతో పోటీ పడుతోంది. ఇండియన్ ఎయిర్ ఫోర్సుకు తొలి ఐదుగురు పైలట్స్‌గా విధులు నిర్వహించిన ఘనత హరీష్ చంద్ర సిర్కార్, సుబ్రొతో ముఖర్జీ, భూపేంద్ర సింగ్, అజాద్ భక్షా అవాన్, అమర్జీత్ సింగ్‌లు వైమానిక చరిత్ర పుటల్లో నిలిచి పోయారు. ఆ తర్వాత సుబ్రతో ముఖర్జీ తొలి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. తర్వాత రెండో ప్రపంచ యుద్ధానికి ముందు.. అంచలం చెలుగా మరింత మంది సిబ్బందిని ఐఏఎఫ్ నియమించు కుంది. వారిలో ఇంజనీర్, కే.కే.ముజుందర్, నరేంద్ర, దల్జీత్ సింగ్, హెన్రీ రంగనాథన్, ఆర్. హెచ్.డి సింగ్, బాబా మెహర్ సింగ్, ఎస్.ఎన్.గోయల్, ప్రిత్‌పాల్ సింగ్, అర్జన్ సింగ్‌లు అగ్రగణ్యులు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో భారత వాయుసేన క్రీయాశీలక పాత్రను పోషించింది. తొలి వైమానిక దళ దాడి అర్కన్ ప్రాంతంలోని జపనీస్ సైనిక స్థావరంపై జరిపింది. ఈ యుద్ధం తర్వాత ఐఏఎఫ్‌ను అంచలం చెలుగా వృద్ధి చెందింది. యూఎస్‌కు చెందిన వుల్టీ వెంగీయన్స్, బ్రిటీష్ హాకర్ హరీకేన్, వెస్ట్‌లాండ్ లైసండర్ వంటి అధునాతన ఎయిర్ క్రాఫ్టలు ఐఏఎఫ్‌లో వచ్చి చేరాయి. అంతేకాకుండా.. భారతావనిపై పొరుగు దేశాలు దాడికి తెగబడినపుడల్లా భారత వాయుసేన కీలక పాత్ర పోషించింది. ముఖ్యంగా.. 1960లో ఏర్పడిన కాంగో సంక్షోభ సమయంలోను, 1962లో జరిగి ఇండో–చైనా పోరు సమయం లోను, కాశ్మీర్ కోసం 1965లో పాకిస్తాన్‌తో జరిగి యుద్ధ సమయంలోను, 1971లో జరిగిన బంగ్లాదేశ్ విముక్తి పోరాటం లోను, 1984లో జరిగి ఆపరేషన్ మేఘదూత్ లోను, 1988లో ఆపరేషన్ కాక్టస్ లోను, 1999లో జరిగిన ఆపరేషన్ సఫేద్ సాగర్ (కార్గిల్ వార్) సమయాల్లో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సేవలు ప్రశంసనీయం. భారత వైమానిక దళంలో ప్రస్తుతం ఉన్న ఎయిర్ క్రాఫ్టలలో మిగ్–21, హాల్–హెచ్‌జెటి – 36, హెచ్‌జెటి–16 కిరణ్, హెచ్‌పిటి–32 దీపక్, ఇయూషిన్ ××–78 ఎంకెఎల్, ఇయూషిన్ ××–76, అంటోనోవ్ ఎఎన్–32, అవ్రో–748, డిఓ–228, ఇఆర్‌జె–135, బోయింగ్ –737, ఎంఐ–8, ఎంఐ–17, ఎంఐ–35, ఎంఐ–26, హెచ్ఎఎల్ చేతక్, హెచ్ఎఎల్ చీటా, హెచ్ఎఎల్ ధృవ్, సుకోయ్–30, మిరజ్–2000, మిగ్–29, జగర్, మిగ్–27, మిగ్–23 తేజాస్, హెచ్ఎఎల్ లైట్ కంబొట్ హెలికాప్టర్, బహళ రవాణా, ఐఎల్–76 రకం ఎయిర్ క్రాఫ్టలతో పాటు. స్వదేశ ఎయిర్‌క్రాఫ్ట్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ సంస్థ హాక్ ఎంకే–132 రకం వంటి పలు రకాలు వాయుసేన అమ్ముల పొదిలో ఉన్నాయి. 1.70 లక్షల మంది సిబ్బందితో, 1300 విమానాలతో భారత వైమానిక దళం ప్రపంచం లోనే నాలుగవ పెద్ద వైమానిక దళంగా ప్రసిద్ధి పొందింది. భారత వైమానిక దళంలో ఐదు ఆపరేషన్ కమాండ్‌లు, రెండు ఫంక్షనల్ కమాండ్‌లు ఉన్నాయి. ఆపరేషన్ కమాండ్‌లు: 1.సెంట్రల్ ఎయిర్ కమాండ్, అలహా బాద్; 2.ఈస్టర్ న్ ఎయిర్ కమాండ్, షిల్లాంగ్; 3.సదరన్ ఎయిర్ కమాండ్, తిరువనంత పురం; 4.సౌత్ వెస్టర్న ఎయిర్ కమాండ్, గాంధీనగర్; 5.వెస్టర్న ఎయిర్ కమాండ్, న్యూఢిల్లీ; డిఫెన్స్ రీసెర్చ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది. దీన్ని 1958లో ఏర్పాటు చేశారు. ఈ సంస్థ క్షిపణులను తయారు చేయడంలో ప్రధానపాత్ర వహిస్తుంది. మన దగ్గర ఉన్న క్షిపణుల్లో బ్రహ్మోస్.. సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి. ఇది ధ్వని కంటే వేగంగా ప్రయాణిస్తుంది. దీన్ని భారత్, రష్యాలు సంయుక్తంగా నిర్మించాయి. భారతదేశం లోని బ్రహ్మపుత్ర, రష్యాలోని మాస్కోవా నది పేర్ల మీద ఈ క్షిపణికి బ్రహ్మోస్ అని పేరు పెట్టారు. దీని పరిధి 290 కిలోమీటర్లు. ఇది 2.5 నుంచి 2.8 మ్యాక్ వేగంతో ప్రయాణిస్తుంది. నిర్భయ్ అనే సబ్‌సోనిక్ క్షిపణి.. ధ్వని వేగం (1 మ్యాక్) కంటే తక్కువ వేగంతో ప్రయాణిస్తుంది. దీని పరిధి 1,000 కి.మీ. భారత దేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత పాకి స్తాన్‌తో 1947, 1965, 1971, 1999లలో నాలుగుసార్లు యుద్ధాలు చేసింది. 1971లో పాకిస్తాన్‌ను ఓడించి, బంగ్లాదేశ్ ఏర్పాటుకు కారణమైంది. 1962లో చైనాతో యుద్ధం చేసింది. భారత రక్షణ వ్యవస్థలో త్రివిధ దళాలు ఉన్నాయి. అవి.. సైనిక దళం, వైమానిక దళం, నావికా దళం. భారత రక్షణ దళాల అధిపతి (సుప్రీం కమాండర్) రాష్ట్రపతి. రక్షణ దళాలు కేంద్ర రక్షణ శాఖ మంత్రి ఆధీనంలో ఉంటాయి. ప్రస్తుత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్. త్రివిధ దళాల ప్రధాన కార్యాలయాలు న్యూఢిల్లీలో ఉన్నాయి.

# శాంతి రక్షకుల దినం

## నేడు రాపిడ్ యాక్షన్ ఫోర్స్ అవతరణ దినోత్సవం




ఎక్కడ అల్లర్లు చెలరేగినా.. మత, సామాజిక ఘర్షణలతో పరిస్థితులు అదుపు తప్పినా.. ప్రజల మధ్య ఉద్రిక్తతలు పెరిగినా.. అత్యంత వేగంగా రంగంలోకి దిగే ప్రత్యేక బలగం రాపిడ్ యాక్షన్ ఫోర్స్. శాంతిభద్రతలను పునరుద్ధరించడం నుంచి విపత్తుల సమయంలో ప్రజలకు అండగా నిలవడం వరకు విభిన్న బాధ్యతలు నిర్వర్తిస్తూ దేశ అంతర్గత భద్రతలో తనదైన ముద్ర వేసిన ఈ దళం అవతరణ దినోత్సవాన్ని అక్టోబర్ 8న నిర్వహిస్తారు. దేశంలో అతిపెద్ద కేంద్ర సాయుధ పోలీసు బలగాల్లో ఒకటైన సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌లో ప్రత్యేక విభాగమే రాపిడ్ యాక్షన్ ఫోర్స్. తొంభైయవ దశకం ప్రారంభంలో దేశంలోని పలు ప్రాంతాల్లో సామాజిక, మతపరమైన ఉద్రిక్తతలు, అల్లర్లు చోటుచేసుకున్న నేపథ్యంలో సంక్షోభ ప్రాంతాలకు వేగంగా చేరుకుని పరిస్థితులను అదుపులోకి తీసుకురాగల ప్రత్యేక దళం అవసరమనే భావనతో దీన్ని ఏర్పాటు చేశారు. సాధారణ శాంతిభద్రతల నిర్వహణకు భిన్నంగా అత్యంత సున్నితమైన పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఈ దళానికి ప్రత్యేక శిక్షణ ఉంటుంది. మత ఘర్షణలు, కుల వివాదాలు, పౌర అశాంతి, హింసాత్మక ఆందోళనలు, భారీ ప్రజా సమూహాలు, ఎన్నికల సమయంలో తలెత్తే ఉద్రిక్త పరిస్థితులను అదుపులోకి తీసుకురావడంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను రంగంలోకి దింపుతారు. పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చే క్రమంలో సాధ్యమైనంత వరకు ప్రాణనష్టాన్ని నివారించేందుకు ప్రాణాంతకం కాని నియంత్రణ పద్ధతులకు ప్రాధాన్యం ఇస్తారు. వాటర్ కేనన్లు, బాష్పవాయువు, రక్షణ కవచాలు తదితర సాధనాలను పరిస్థితులకు అనుగుణంగా వినియోగిస్తారు. ప్రజల భద్రతతోపాటు మానవ హక్కులను గౌరవించడం, సామాజిక సున్నితత్వంతో వ్యవహరించడం శిక్షణలో కీలక అంశాలుగా ఉంటాయి. రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సేవలు అల్లర్ల నియంత్రణకే పరిమితం కావు. వరదలు, తుఫానులు, భూకంపాలు, అగ్నిప్రమాదాలు వంటి విపత్తుల సమయంలో సహాయక, రక్షణ కార్యక్రమాల్లోనూ సిబ్బంది పాల్గొంటారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అత్యవసర సహాయం అందించడం వంటి కార్యక్రమాల్లో ఇతర ప్రభుత్వ విభాగాలతో కలిసి పనిచేస్తారు. మహిళలతో కూడిన దళాలకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనే ఆందోళనలు, నిరసన కార్యక్రమాల సమయంలో పరిస్థితులను సున్నితంగా ఎదుర్కొనేందుకు మహిళా సిబ్బందిని వినియోగిస్తారు. మహిళా భద్రత, చిన్నారుల రక్షణ, మత సామరస్యం, సామాజిక సౌభ్రాతృత్వం వంటి అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పిస్తారు. సంక్షోభం తలెత్తిన ప్రాంతానికి అత్యంత వేగంగా చేరుకుని పరిస్థితులను అదుపులోకి తీసుకురావడం రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ప్రత్యేకత. క్రమశిక్షణ, వేగవంతమైన స్పందనతోపాటు ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ శాంతిని పునరుద్ధరించడమే లక్ష్యంగా పనిచేస్తుంది. సున్నిత ప్రాంతాల్లో స్థానిక ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తూ సామాజిక సామరస్యాన్ని పెంపొందించే కార్యక్రమాలనూ చేపడుతుంది. అంతర్జాతీయ శాంతి పరిరక్షణ కార్యక్రమాల్లోనూ భారత కేంద్ర సాయుధ పోలీసు బలగాల సిబ్బంది సేవలందించారు. ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణ కార్యక్రమాల్లో భారత బలగాలు చూపిన క్రమశిక్షణ, సేవాభావం దేశానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. తీవ్రవాదం, సామాజిక ఉద్రిక్తతలు, మత విద్వేషాలు, హింసాత్మక ఆందోళనలు వంటి సవాళ్లు ఎదురవుతున్న సమయంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ వంటి ప్రత్యేక బలగాల బాధ్యత మరింత కీలకంగా మారుతోంది. శాంతిభద్రతలను కాపాడటమే కాకుండా ప్రజల్లో భద్రతా భావాన్ని కలిగించడం, సామాజిక ఐక్యతకు అండగా నిలవడం ఈ దళం సేవల్లో ముఖ్యమైన భాగం. అక్టోబర్ 8న నిర్వహించే అవతరణ దినోత్సవం.. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న సిబ్బంది సేవలను గుర్తుచేసుకునే సందర్భం. ఉద్రిక్తతల మధ్య శాంతిని నెలకొల్పుతూ.. సంక్షోభ సమయంలో ప్రజలకు అండగా నిలుస్తున్న రాపిడ్ యాక్షన్ ఫోర్స్ దేశ అంతర్గత భద్రతా వ్యవస్థలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.

